# గెరిల్లా అమ్మ

## కామ్రేడ్ నవత యాదిలో



అమరుల బంధుమిత్రుల సంఘం ప్రచురణ

**గెరిల్లా అమ్మ**
**కామ్రేడ్ నవత యాదిలో**


ఏబీఎంఎస్ ప్రచురణ

ప్రచురణ కాలం : జూలై, 2016
వెల : 20/-

ప్రతులకు : పద్మకుమారి
డోర్ నెం. 50-348-ఎల్-19బి2
అరోరా నగర్
కర్నూలు-2.

ముద్రణ : చరిత ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్.
ఫోన్ : 040-27678411

# నవతగా సులోచన

ఆరోజు కామారెడ్డిలో బస్సు దిగే సరికి ఉదయం పది గంటలైంది.

అక్కడి విలేఖర్లకు ఫోన్ చేసి సంగోజివాడికి ఎలా వెళ్లాలని అడిగాం. వాళ్లు చెప్పినదాని ప్రకారం బస్టాండు నుంచి బయటికి వచ్చి ఒక ఆటో మాట్లాడుకున్నాం.

కా. సులోచన అలియాస్ నవత కుటుంబాన్ని ముందు పలకరించి, అటునుంచి అటే ఇస్రోజివాడికి కూడా వెళ్లాలి. అది ఆమె అత్తగారి ఊరు. వాళ్లను కూడా పలకరించి రావాలని అనుకున్నాం.

గత ఏడాది బంధుమిత్రుల సంఘం ఆవిర్భావ దినం సందర్భంగా మూడో మహాసభల్లో జెండా ఎత్తబోతుండగా కా. నవత అమరత్వ వార్త మాకు చేరింది. మొదటి రోజు స్థూపం దగ్గర రోజంతా అమరుల బంధుమిత్రుల దు:ఖాన్ని పంచుకొని కన్నీటి వరదల్లో కలగలసిపోయి ఉన్నాం. రెండో రోజు ఆ దు:ఖం నుంచి ఇంకా తేరుకోకుండానే మూడో దశ ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా జరగాల్సిన బహిరంగ సభకు వందలాదిగా అమరుల కుటుంబ సభ్యులు, విప్లవాభిమానులు వచ్చారు. అమరుల నెత్తుటి జెండా ఎత్తబోతున్న సమయంలో కా. నవత అనారోగ్యంతో విప్లవోద్యమంలో అమరురాలైందనే సమాచారం వచ్చింది.

వేలాది మంది అమరత్వ దు:ఖాన్ని పంటి బిగువునపట్టి ఎర్రజెండా ఎగరేసినట్లుగానే కా. నవత అమరత్వాన్ని ఎత్తిపట్టాం. ఒక తీరని దు:ఖంలో నుంచి మరో దు:ఖంలోకి విస్తరించిన క్షణాన కూడా పిడికిలి ఎత్తి నిలబడటమే అమరులకు మనం ఇచ్చే నివాళి. విప్లవోద్యమం తరపున నవత స్మృతిలో కా. వరవరరావు ఎర్రజెండా ఎగరేశారు.

అమర్‌హై కా.నవత అనే నినాదాలు మిన్నంటాయి.

దు:ఖాన్ని దిగమింగుకుంటూనే అమరుల రక్త సంబంధీకులు, బంధుమిత్రులు బూటకపు ఎన్‌కౌంటర్లకు, గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా పోరాడదామని నినదించారు. ఆ సందర్భంగా మావోయిస్టు పార్టీ పంపిన నవత అమరత్వ సందేశాన్ని చదివి, నిజామాబాద్ విప్లవోద్యమంలో ఎందరో వీరుల పాత్రను గుర్తు చేసుకొని ప్రేరణ పొందాం. అందరినీ ప్రభావితం చేయగల ఆదర్శ గెరిల్లా కా. నవత.

అమరత్వ వార్త తర్వాతనే ఆమెతో నా అనుబంధం మొదలైంది. బంధుమిత్రుల సంఘంలోని కార్యకర్తలందరికీ అనేక మంది అమరులు ఇలాంటి అనుభవం ద్వారానే పరిచయమవుతారు. విప్లవకారులు తమ అమరత్వం తర్వాతే మా మనసుకు పూర్తిగా దగ్గరవుతారు. ఉద్యమంలోకి వెళ్లక ముందు వాళ్ల వ్యక్తిగత జీవితం దగ్గరి నుంచి విప్లవోద్యమంలో వాళ్లు నిర్వహించిన పాత్ర దాకా అప్పుడే మాకు తెలియడం మొదలవుతుంది. నవత గురించి మావోయిస్టు పార్టీ పంపిన సంతాప సందేశంలో ఆమె విప్లవ జీవితంలోని అనేక కోణాలు తెలిశాయి. ఉద్యమంలోకి వెళ్లక ముందు సంగోజివాడిలో, ఇస్రోజివాడిలో ఉన్నప్పటి ఆమె జీవితం తెలిసింది.

అమరులను వాళ్ల తల్లిదండ్రులు, జీవిత సహచరులు, కన్న బిడ్డలు, బంధు మిత్రులు గుర్తు చేసుకుంటూ దు:ఖిస్తారు. వాళ్ల గురించిన జ్ఞాపకాలు పంచుకుంటారు. వాటి ద్వారా మాకు ఆ అమర వీరుల జీవితం దగ్గరవుతుంది. అవన్నీ వింటూ ఉంటే వాళ్లు మాకు చాలా దగ్గరి మనుషులని అనిపిస్తుంది. ఎప్పటి నుంచో తెలిసిన వాళ్లుగా ఉంటుంది. కా. నవత విషయంలో కూడా మాకు అట్లే అనిపించింది. అందునా ఈమె తల్లిగా బిడ్డలతోపాటు విప్లవోద్యమంలోకి వెళ్లింది కదా.

కామారెడ్డి నుంచి సంగోజివాడి గ్రామం 12 కిమీ. చెట్లు చేమలు దాటి, పచ్చని చేన్ల మధ్య నుంచి ఆ ఊరికి చేరుకున్నాం. ఆ రోజు నవత అమరత్వం గురించి పత్రికల్లో వచ్చింది. అందువల్ల ఊళ్లో అడగ్గానే నవత వాళ్ల ఇల్లు మాకు చూపించారు.

అదో పెంకుటిల్లు. ముందు గదిలో ఆడవాళ్లు కూర్చొని ఏడుస్తూ కనిపించారు. ఒకరిద్దరు మగవాళ్లు ఉన్నారు. మమ్మల్ని, మాతో ఉన్న విలేఖర్లను చూసి భయంభయంగా మగవాళ్లు బయటికి వెళ్లిపోయారు.

ఒక్కసారిగా ఏడుపులు ఆగిపోయాయి. గోడకు ఓ మూల సులోచన తల్లిదండ్రులు కావచ్చు కూర్చొని కన్నీళ్లు తుడుచుకుంటున్నారు.

మా గురించి చెప్పి, మిమ్మల్ని పలకరించడానికి వచ్చామని అన్నాం. మా వైపు వాళ్లు వింతగా, భయంగా చూస్తూనే కూచోమని కుర్చీ బల్ల చూపించారు. ఏనాడో దూరమైపోయిన బిడ్డ కోసం రోదిస్తున్న వాళ్ల దగ్గర ఇలాంటి పలకరింపు మాటలు, పరామర్శలు చేయవలసి రావడం బంధుమిత్రుల సంఘం సభ్యులకు ఒక విషాదకరమైన బాధ్యత.

'నవతక్క అమ్మనా?' అని పెద్దామెని చూపించి అడిగాం.

ఇంకా మేమేదో మాట్లాబోయాం. కానీ వాళ్ల గత చేదు అనుభవాలు ఎలాంటివో గాని దానికి మిగతా వాళ్లు ఏమీ స్పందించలేదు. రెండు నిమిషాలయ్యాక ఆమెనే గుడ్ల నీళ్లు కుక్కుకుంటూ అవునని తలూపింది.

మృతదేహాన్ని కూడా తేలేకపోయామనే దు:ఖాన్ని వాళ్లతో పంచుకున్నాం. నవత

చెల్లెలు మాట్లాడుతూ .. 'ఆయన్ను కట్టుకున్నప్పటి నుంచి ఆమెకు అన్నీ కష్టాలే. ఆమె సుఖపడింది లేదు, మమ్మల్ని సుఖంగా ఉండనిచ్చిందీ లేదు..' అన్నది.

అవును కదా. సుఖ సంతోషాలకు సగటు మనుషులకు చాలా మామూలు లెక్క లేవో ఉంటాయి. అవి న్యాయమైనవి. వాటికి కూడా నోచుకోకపోతే వాళ్లు తట్టుకోలేరు. సులోచన సహచరుడు ఎన్నుకున్న మార్గం, చివరికి ఆ మార్గంలోనే ఇద్దరు బిడ్డలతో సులోచన అజ్ఞాత ఉద్యమంలోకి వెళ్లిపోయి నవతగా మారడం.. ఇవన్నీ సగటు మనుషులకు కష్టం.

ఆమె ఆ ఇంట తొలిచూలు బిడ్డ. మెట్టినింట బాధ్యతగల కోడలు. రైతాంగ మహిళ. స్వతహాగా బీడీలు చుట్టి బతికిన కార్మికవర్గ పుత్రిక. ఆమె సహచరుడు కా. ప్రభాకర్ మాటల్లోనే చెప్పాలంటే ఆయన హృదయంలో విరిసిన మల్లియ. ఇన్నింటితోపాటు ముగ్గురు బిడ్డలకు తల్లి, ఒక విప్లవకారుడికి సహచరి అయినందుకు ఆమె ఆ రోజుల్లో చెల్లించుకున్న మూల్యం సామాన్యమైనదేమీ కాదు.

ఆమె బయట ఉన్న రోజుల్లో పడిన బాధలు బంధువుల మాటల్లో అర్థమయ్యాయి. రాజ్యం ఆమె జీవితంతో ఎంత చెలగాటమాడిందో తెలుస్తున్న కొద్దీ గుండె తరుక్కుపోయింది. పెద్దామ్మాయి వికలాంగురాలు. ఆమెను, మిగతా ఇద్దరు బిడ్డల్ని పెంచడానికి నవత అష్టకష్టాలు పడింది. వికలాంగురాలైన కూతురు మరణించాక ఉద్యమంలోకి వెళ్లింది.

అట్లా అక్కడున్న వాళ్లందరూ తమ వలపోతలో భాగంగా ఆమె గురించి ఎన్నో చెప్పుకొచ్చారు. వాళ్లు సులోచనపడ్డ కష్టాలు గుర్తు చేసుకున్నారు. ప్రభాకర్ అజ్ఞాతానికి వెళ్లిపోయాక ఆయన హృదయంలోని మల్లియ ఆయన ఎడబాటుకు ఎంతగా విలవిల్లాడిపోయిందో, ఆమె ఎంత పోలీసు నిర్బంధం అనుభవించిందో వాళ్లు చెప్పారు.

'ఆయన అట్ల వెళ్లిపోయినా సులోచన బిడ్డల్ని కనిపెట్టుకొని ఉండిపోవచ్చు కదా. ఎవరైనా అట్లనే చేస్తారు. కానీ తను అట్ల ఉండలేకపోయింది. బిడ్డల్ని కూడా వదిలేసి ఆయన దగ్గరికే వెళ్లిపోయింది. వాళ్లేం పిల్లలో.. వాళ్లు అందరి పిల్లల్లాగా ఉండకుండా తల్లిదండ్రులను వెతుక్కుంటూ వెళ్లిపోయారు..' అని కుటుంబసభ్యులు అన్నారు.

ఆ మాటలతో సులోచనది ఎంత బలమైన వ్యక్తిత్వమో తెలిసింది. ఆమె పైన గౌరవం మరింత పెరిగింది. ఆమెలో ఎంత పోరాటం ఉన్నదో, ఎంత దు:ఖం ఉన్నదో ఈ పుస్తకం చదివితే తెలుస్తుంది.

ప్రజల కోసం భర్త, భర్తను అనుసరిస్తూ బైట నిర్బంధం మధ్యనే కార్యకర్తగా ఎదిగి ఉద్యమంలోకి వెళ్లిపోయిన భార్య, తీవ్ర నిర్బంధంలో అజ్ఞాత విప్లవకారుల పిల్లలుగా తల్లిదండ్రులను వెతుక్కుంటూ విప్లవోద్యమంలోకి వెళ్లిపోయిన కొడుకు, కూతురు.

ఒకే సమాజంలో ఒకే కాలంలో మన మధ్య పుట్టి పెరిగిన మనుషులు వీళ్లు. ఈ సమాజాన్ని అర్థం చేసుకొని, ఇక్కడ ఉంటే తాము అనుకున్న పని చేస్తూ బతకలేమని నలుగురూ వేర్వేరు సందర్భాల్లో ఒకే నిర్ణయం తీసుకున్నారు. అయినా కుటుంబం విచ్ఛినం కాకుండా ఎలా కాపాడుకోగలిగారు. కుటుంబ సభ్యులందరి మధ్య ఎంత భావసారూప్యత? ఇలా కుటుంబ సభ్యులందరినీ తనలో ఇమిడ్చుకుంటున్న విప్లవోద్యమం ఎంత గొప్పదో కదా.

తల్లి అమరత్వం తర్వాత సులోచన కుమారుడు ఈ పుస్తకం కోసం రాసిన ఒక రచనలో ఇలా అన్నాడు.

'ఒకనాడు తండ్రికి ఎడమై తల్లి ప్రేమలోనే తండ్రిని చూసుకుంటూ బతికాం. ఇప్పుడు తల్లికి శాశ్వతంగా దూరమై నాన్నలోనే తల్లిని చూసుకుంటున్నాం. అమ్మమ్మా... మేం కఠోరమైన యుద్ధంలో ఉన్నామే. నీవు బిడ్డకు దూరమైనట్లే మేం తల్లికి దూరమయ్యాం. ఈ దోపిడీ వ్యవస్థ కారణంగానే అమ్మకు దూరమయ్యాం. అమ్మ ఇక మాకు కనిపించదు. ఈ దు:ఖాన్ని ఇలా అక్షరాలతో పంచుకోవడం అసాధ్యం. ఇంటికాడే కాదు, విప్లవంలోనూ అమ్మను చాలా గాఢంగా ప్రేమించాం. తలుచుకుంటే మేం ఒంటరయ్యామా అనిపిస్తోంది. అమ్మ స్పర్శ మాయమైంది. అమ్మ చూపుకు అందకుండా పోయింది. చిన్నప్పుడు అమ్మ కొంగుపట్టుకొని మారాం చేసిన రోజులు పదే పదే గుర్తుకు వస్తున్నాయి. మాకు బాల్యంలోని ఇలాంటి ఒకటి రెండు మధురమైన గుర్తులు తప్ప ఏం మిగిల్చిందే ఈ రాజ్యం. మనసు తడిసి ముద్దయిపోతోంది. అమ్మ లేదని అంగీకరించడం కష్టంగా ఉంది.

విప్లవకారులుగా, ఒక విప్లవకారిణి బిడ్డలుగా అమ్మ అమరత్వం అత్యున్నతమైనదని మేం గుర్తించాం. దండకారణ్య ప్రజలూ గుర్తించారు. అందుకే అమ్మ అంతిమయాత్రను దగ్గరుండి జరిపించారు...వాళ్లతో దు:ఖాన్ని పంచుకున్న మేం వాళ్లలోనే అమ్మను పొందగలిగాం.. ' అని రాశాడు.

ఒక మామూలు గృహిణి సులోచన నవతగా మారిన తీరు, మహోన్నత వ్యక్తిత్వాన్ని సంతరించుకున్న తీరు, సమాజంపట్ల, కుటుంబం పట్ల ఆమె బాధ్యత పడ్డ తీరు, సొంత ఆస్తి పునాదిగా ఉండే కుటుంబాన్ని ఉద్యమపరం చేసిన తీరు ఆమెలాంటి అరుదైన వ్యక్తులకే సాధ్యం. అందుకే ఈ పుస్తకంలోని ప్రతి అక్షరం నవత జీవితాన్ని, చైతన్యాన్ని ప్రకటిస్తున్నాయి.

**– పద్మకుమారి**

# ఆదర్శ వీర వనిత కామ్రేడ్ నవత

**ఓ తల్లికి ముద్దుల తనయ–ఓ హృదయంలో విరిసిన మల్లియ**

కామ్రేడ్ సులోచన తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్ జిల్లా, తాడ్వాయి మండలంలోని సంగోజివాడి గ్రామంలో మధ్య తరగతి రైతు కుటుంబంలో 1971లో జన్మించింది. రాంబాయి, ఆయిల శ్యాంరావు దంపతుల మొదటి సంతానం ఆమె. కాగా ఆమెకు ముగ్గురు చెల్లెళ్లు వున్నారు.

ఇంటికి పెద్ద బిడ్డ అవడం మూలంగా ఇంటి పనుల్లో, చెల్లెండ్ల పెంపకంలో తల్లికి చేదోడు వాదోడుగా వుండాలనే వుద్దేశంతో తల్లిదండ్రులు ఆమెను బడికి పంపలేదు. నిజామాబాద్ జిల్లాలోని శ్రామిక మహిళలకు బీడీ పరిశ్రమ పెద్ద ఉపాధి రంగంగా వుంది. చిన్నారి సులోచన కూడా ఇంటి పనుల్లో అమ్మకు చేదోడు వాదోడుగా వుంటూనే తన చిట్టి చేతులతో బీడీలు చుట్టడం మొదలుపెట్టింది.

ఆడపిల్లను గుండెల మీద కుంపటిగా భావించే పితృస్వామిక భావజాలం ప్రభావంతో 1984లో పదమూడేళ్ల వయసులోనే తల్లిదండ్రులు కామ్రేడ్ సులోచనకు వివాహం చేశారు. అదే జిల్లాలోని ఇస్రోజివాడి గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబంలో కోడలుగా అడుగుపెట్టిందామె. వ్యవసాయ కుటుంబంలో పుట్టినప్పటికీ బీడీలు చేయడం తప్ప ఆమెకు వ్యవసాయం పనుల్లో ప్రవేశం లేకుండే. కానీ మెట్టినింట్లో వ్యవసాయం పని తప్పలేదు. చాలా కష్టపడి పట్టుదలగా వ్యవసాయపు పనులు నేర్చుకుందామె. 1987లో ఆమె మొదటి బిడ్డకు జన్మనిచ్చింది. అయితే పాప పుట్టుకతోనే వికలాంగురాలు. అప్పటి దాకా ఉమ్మడిగా వున్న కుటుంబం విడిపోవడంతో పాపను చూసుకునే వాళ్లు లేక కామ్రేడ్ సులోచన వ్యవసాయ పనులకు దూరమైంది. అయితే పూర్తిగా ఇంటి పనులకే పరిమితం కాకుండా తనకు ప్రవేశమున్న బీడీలు చుట్టే పనిలోకి తిరిగి ప్రవేశించింది. అట్లా కార్మిక వర్గ జీవితాన్ని గడుపుతూ వచ్చింది.

## మరో ప్రపంచపు పిలుపుకు స్పందించిన సహచరుడు

అవి తెలంగాణాలో ప్రత్యేకించి ఉత్తర తెలంగాణాలో మనుపటి సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) కార్యకలాపాలు ఉధృతంగా కొనసాగుతున్న రోజులు. నిర్బంధం తీవ్రరూపం దాల్చిన రోజులు. గ్రామాలపై దాడులు, అరెస్టులు, చిత్రహింసలు, బూటకపు ఎన్‌కౌంటర్లు నిత్యకృత్యంగా మారిన రోజులు. గ్రేహౌండ్స్, బీఎస్ఎఫ్ పదఘట్టనలతో పల్లెలు నలిగిపోతున్న రోజులు. అయినప్పటికీ పీడిత ప్రజలకు పార్టీ పట్ల విశ్వాసం చెక్కుచెదరలేదు. నూతన శక్తులు పార్టీ నాయకత్వంలోకి వస్తూనే వున్నాయి. అట్లా కామ్రేడ్ సులోచన జీవిత సహచరుడు కూడా అటువంటి నిర్బంధ కాలంలోనే పార్టీ దిక్కు ఆకర్షితుడై, పార్టీ సభ్యుడిగా ఎదిగి క్రియాశీలక కార్యకర్త అయ్యాడు. ఫలితంగా ఒక దిక్కు వ్యవసాయపు పనులు కుంటుపడ్డాయి. మరో దిక్కు వాళ్ల ఇంటిపై పోలీసు దాడులు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా జరిగే పోలీసు దాడుల నుండి ప్రజల సహకారంతో తన జీవిత సహచరుడితో పాటు ఆమె కూడా చంటి బిడ్డలను చంకనేసుకొని తప్పుకునేది. ఎవరూ దొరకక పోవడం వల్ల పిచ్చెత్తిన పోలీసులు ఇంటి తలుపు చెక్కలతో సహా ఇంట్లోని సామాన్లన్నింటినీ ధ్వంసం చేసేవారు. పోలీసుల విధ్వంసం, ఉరుకులు, పరుగుల జీవితం వల్ల మానసికంగా ఆమెకు ప్రశాంతత కరువైంది. దీనంతటికీ సహచరుడి కార్యకలాపాలే కారణమని భావించి అతనితో ఘర్షణకు దిగేది. ఆ కామ్రేడ్ ఆమెకు ఓపిగ్గా అర్థం చేయించేవాడు. అతను పార్టీలోకి పూర్తి కాలం వెళ్లిపోతాడేమోననే భయంతో అతన్ని దక్కించుకోవడం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసింది. మాట్లాడింది. నచ్చజెప్పింది. వాదించింది. ఇక లాభం లేక ఎందరో దేవుళ్లకు మొక్కుకుంది. ముడుపులు కట్టింది. ఆమె చేసిన ఏ ప్రయత్నాలూ అతన్ని రహస్య జీవితంలోకి వెళ్లకుండా ఆపలేకపోయాయి.

సహచరుడు రహస్య జీవితంలోకి వెళ్లడం అనేది మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా ఆమెను మరిన్ని వత్తిళ్లకు గురి చేసింది. అతని ఎడబాటు కలిగించే వేదన. తన ఒక్కదాని రెక్కల కష్టంతో ముగ్గురు పిల్లల్ని ఎట్లా పోషించాలనే దిగులు. తండ్రి ప్రేమ, తండ్రి ఉనికి కల్పించే భద్రత కరువైన పిల్లల భవిష్యత్ పట్ల ఆందోళనలతో ఆమె మనసు అల్లకల్లోలమయ్యేది. అది చాలనట్టు ఏ కారణంతో భర్తలు ఇల్లు పట్టకుండా తిరిగినా అత్తా-మామలూ, ఇతర కుటుంబ సభ్యులూ, ఇరుగూ పొరుగు వారి నుంచి భార్యలు చిన్నచూపును, సూటి పోటీ మాటలను భరించవలసి రావడం సర్వసాధారణం. కామ్రేడ్ సులోచనకు కూడా అటువంటి వాతావరణం తప్పలేదు.

అయితే రక్త సంబంధం కంటే వర్గ సంబంధం గొప్పదని నిరూపిస్తూ పోరు ప్రజలు ఆమెకు అండగా నిలిచారు. వాళ్లకు ఉన్న కొద్ది పాటి భూమిని ప్రజలే సాగు చేసేవారు. అయితే పోలీసులు దాన్ని అడ్డుకోవడంతో ఆ భూమి కాస్తా బీడుపడింది. దాంతో ఆమెకు బీడీల వృత్తే జీవనాధారం అయింది.

## జీవన్మరణ పోరాటం

అయితే ఆమె మానాన ఆమెను బతికనిస్తారా పోలీసులు? తన సహచరుడిని లొంగదీసుకోవడానికి ఆమెనొక సాధనంగా భావించిన పోలీసులు ఆమెపై వేధింపులు తీవ్రం చేశారు. కౌన్సిలింగులకు రమ్మని ఆ గ్రామ సర్పంచు ద్వారా, పెద్ద మనుషుల ద్వారా ఆమెపై వత్తిడి తెచ్చారు. కానీ కౌన్సిలింగ్‌లకు వెళ్లడానికి తను తిరస్కరించడంతో ఇన్నాళ్లూ తన సహచరుడి కోసం వాళ్ల ఇంటిపై దాడులు చేసిన పోలీసులు ఇప్పుడు ఆమె కోసం దాడులు చేయడం ప్రారంభించారు. ఎప్పటి వలెనే ఆమె ప్రజల సహకారంతో చాకచక్యంగా ఆ దాడుల నుండి తప్పుకునేది. కానీ ఒకసారి ఆకస్మాత్తుగా జరిగిన దాడిలో ఆమె పోలీసుల చేతులకు దొరికిపోయింది. ఇంటిలో విధ్వంసం సృష్టించి పోలీసు సహజమైన భాషలో ఆమెనూ, ఆమె సహచరుడినీ తిట్టడం మొదలు పెట్టారు. అవమానాన్ని భరించలేని ఆమె చెప్పు తీసుకొని తిరగబడింది. ఆమె నుండి అటువంటి ప్రతిఘటన వస్తుందని ఊహించని పోలీసులకు వెనక్కి తగ్గక తప్పలేదు. అయితే ఆ తర్వాత ఆమెను కౌన్సిలింగులకు తీసుకు వచ్చే బాధ్యతను పోలీసులు ఆమె అత్తమామలు, బావలకు అప్పజెప్పారు. వాళ్ల వత్తిడిని తట్టుకోలేని కామ్రేడ్ సులోచన కౌన్సిలింగులకు పోవాల్సి వచ్చింది. అయితే అక్కడ భర్తను లొంగిపొమ్మని పత్రికా ప్రతినిధుల ముందు ప్రకటనలిమ్మని పోలీసులు చేసే వత్తిడికి ఆమె తలవంచ లేదు. “నేను సరెండర్ కమ్మంటే కావడానికి అతనేమన్నా నా కొడుకంత చిన్న పిల్లవాడనుకుంటున్రా? మీ తల్లిదండ్రులు, మీ భార్యలు మిమ్మల్ని పోలీసు ఉద్యోగం చేయమంటేనే చేస్తుండ్రా? వద్దంటే ఉద్యోగం బంద్‌పెడ్తరా?” అంటూ ఆక్రోశం వెళ్లగక్కేది.

ఈ నిర్బంధాన్ని, ఇతర వత్తిడులను తట్టుకోలేని కామ్రేడ్ సులోచన పిల్లలతో సహా బలవంతంగా చచ్చిపోవాలని కూడా ఒకసారి ఆలోచించింది. పిల్లలకు విషం ఇచ్చి, తనూ విషం తాగి రైలు పట్టాలపై పడుకోవాలనే ఆలోచనతో రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. చావు బతుకులు, ఆశ నిరాశల మధ్య వూగిసలాడుతూ రైలు కోసం ఎదురుచూస్తూ, తన కడుపు పంటను తానే చంపుకోబోతున్న తన దుస్థితికి కన్నీరు

మున్నీరవుతున్న వేళ యాదృచ్ఛికంగా ఒక 'అమ్మ' పరిచయమైంది. పార్టీ సానుభూతిపరురాలైన ఆ అమ్మ ఆమెను ఓదార్చింది. ధైర్యం చెప్పింది. తన ఇంటికి తీసుకెళ్లి రెండు నెలలు తన కడుపులో పెట్టుకుంది. పార్టీ కాంటాక్టును వెతికి పట్టుకొని పార్టీకి అప్పజెప్పి, సంతోషించింది.

తన సహచరుడు రహస్య జీవితానికి వెళ్లిపోయినప్పటికీ కామ్రేడ్ సులోచన అతనితో పెనవేసుకొని పోయిన గాఢమైన సహచర్యాన్ని వదులుకోలేదు. అవకాశం వచ్చినప్పుడల్లా అతన్ని కల్సేది. అతనికి అన్ని రకాలుగా సహకరించేది. అట్లా ఆమెకు దళ జీవితం పరిచయమైంది. రాజకీయాలు మరింతగా అవగతమయ్యాయి. దానితో తాను కూడా ఉద్యమంలో చేరాలనే కోరికను సహచరుడి ముందు వ్యక్తం చేసేది. అదే సమయంలో తను కూడా ఉద్యమంలోకి వెళ్లిపోతే పిల్లల భవిష్యత్ ఏమవుతుందోనని ఘర్షణ పడేది. పార్టీలో చేరాలనే ఆమె ఆకాంక్షను అర్థం చేసుకున్న సహచరుడు, పిల్లలను తమ కుటుంబాలకు అప్పజెప్పడం గానీ, లేదా పిల్లలు లేని వారెవరికైనా పూర్తిగా ఇచ్చివేద్దామని గానీ ప్రతిపాదించాడు. తల్లి మనసుకు అత్యంత కష్టమైన ఆ ప్రతిపాదనకు ఆమె అంగీకారం తెలిపింది. పిల్లల్ని పెంచుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో పిల్లలు కాస్త పెరిగే వరకూ ఇంటి వద్ద వుండి, ఆ తర్వాత పిల్లల బాధ్యతను పార్టీకి అప్పగించి ఉద్యమంలోకి రావొచ్చుననే సహచరుడి సూచనను ఆమోదించి ఇంటి వద్దే వుండిపోయింది. కొన్నాళ్లకు ఆడపిల్లలను తన దగ్గరే వుంచుకొని, కొడుకును వేరే చోట పెట్టి చదివిస్తే బాగుంటుందని పార్టీ ఆమె ముందు ప్రతిపాదన పెట్టింది. పుట్టుకతోనే తండ్రి మొఖం చూడని కొడుకుకు తల్లి ప్రేమను కూడా దూరం చేయడానికి ఆమెకు మనసొప్పక పోయినా కొడుకు చదువూ, భవిష్యత్‌లను దృష్టిలో పెట్టుకొని అంగీకరించింది. అలా రెండు సంవత్సరాలు కొడుకు వేరే చోట చదువుకున్నాడు. కానీ పోలీసు నిర్బంధం కారణంగా తర్వాత తిరిగి తల్లి వద్దకే చేరాడు.

కొన్నాళ్ల తర్వాత పార్టీ ఆమెను పిల్లలతో సహా అదే జిల్లాలోని రాహత్‌నగర్ గ్రామంలో స్థిరపరిచింది. అక్కడ బీడీలు చేసుకుంటూ పిల్లల్ని చూసుకుంటూ రెండేళ్లు గడిపింది. పిల్లలకు క్రమశిక్షణ నేర్పడంలో ఆమె శ్రద్ధపెట్టేది. వాళ్లను బాధ్యతాయుతంగా మలచడం కోసం అందరికీ చిన్న చిన్న పనులను అప్పగించేది. వాళ్లు పనులు సమర్థవంతంగా చేసేలా వెన్నుతట్టి ప్రోత్సహించేది. ఇతరులను గౌరవించడం, వస్తువులను జాగ్రత్తగా కాపాడుకోవడం, విలాసాలను ఆశించకుండా సాదాసీదా జీవన శైలిని అలవర్చుకోవడం వంటి సుగుణాలను ఆమె పిల్లలకు వారసత్వంగా అందించింది.

ఫలితంగా పిల్లలకు జ్ఞానం వచ్చేప్పటికి తల్లిని పాజిటివ్‌గా అర్థం చేసుకొనే స్థితికి ఎదిగారు వాళ్లు. విప్లవోద్యమ ప్రభావం బలంగా వున్న ఆ గ్రామ ప్రజలు ఆమెకు అన్ని రకాలుగానూ సహకరించేవారు. రక్త సంబంధీకుల దగ్గర కూడా దొరకని ప్రేమా, ఆప్యాయత, సహకారాలను వర్గబంధం నుండి పొందిందామె.

## నేను సైతం ప్రపంచాగ్నికి...

1999లో అంగవైకల్యంతో పుట్టిన పెద్ద బిడ్డ రజిత చనిపోయింది. ఆ తల్లి హృదయం ఎంతగా దుఃఖించి వుంటుందో. మరో సంవత్సరం గడిచాక 2000లో మిగతా ఇద్దరు పిల్లల్ని నాయనమ్మ, తాతల దగ్గర వదిలి “అమ్మమ్మా వాళ్లింటికి పోయొస్తనని” చెప్పి అజ్ఞాత వాసంకు వెళ్లిపోయిందామె. పీఎల్‌జీఏలో చేరిన తరువాత తన పేరును నవతగా మార్చుకుంది. తల్లి కోసం ఎదురుచూస్తున్న పిల్లలకు ఒక రోజు తల్లి నుండి కబురు వచ్చింది. తల్లి ఒడిలోకి చేరాలని ఆరాటంగా వెళ్లిన పిల్లలు తమను అక్కున చేర్చుకునేంత వరకూ తల్లిని గుర్తుపట్టనే లేకపోయారు. పిల్లల ఆశ్చర్యానికి అంతే లేక పోయింది. ఎందుకంటే జ్ఞానం వచ్చినప్పటి నుండీ తాము చూసిన రూపం కాదామెది. ఇప్పుడామె ఆకు పచ్చ యూనిఫారంలో, భుజాన తుపాకీతో వున్న గెరిల్లా.

కామ్రేడ్ నవత దళ నియమ నిబంధనలను, క్రమ శిక్షణను ఖచ్చితంగా పాటిస్తూ సెంట్రీ చేయడం, నీళ్లు, కట్రలు మోసుకురావడం, వంట చేయడం వంటి రోజువారీ దళ సమిష్టి కార్యక్రమాల్లో శక్తి వంచన లేకుండా పాల్గొంటూ అందరి అభిమానాన్ని చూరగొన్నది. అనారోగ్యంతో వుండే కామ్రేడ్స్‌కు ఆత్మీయానురాగాలు పంచుతూ సేవలు చేసేది. తనకు అనారోగ్యంగా వున్న సందర్భాల్లో కేడరంతా తన చుట్టూ చేరి సేవలు చేయడం ఆమెను ఎంతగానో కదిలించేది. వర్గ సంబంధంలోని ఔన్నత్యానికి మరింతగా ప్రభావితురాలయ్యేది. తుపాకీ పట్టుకున్న చేతులతోనే పలకా బలపం పట్టుకొని అక్షరాలు దిద్దింది. ప్రాథమిక విద్యతో పాటు రాజకీయ అధ్యయనం మొదలు పెట్టింది. శాకాహారాన్ని పాటిస్తూ, వెనకబడిన, దళిత కులాల పట్ల అంటు ముట్టు పాటిస్తూ చిన్నచూపు చూసే ఆరె సామాజిక వర్గంలో పుట్టి పెరిగిందామె. ఆ సామాజిక వర్గం నుండి మహిళలు విప్లవోద్యమంలోకి రావడమే అరుదు. ఆ నేపథ్యం నుండి వచ్చిన కామ్రేడ్ నవత వెనుకబడిన కులాల, దళిత కులాల ప్రజలతో కలిసిపోతూ వాళ్లు పెట్టిన మాంసాహారాన్ని కూడా చాలా ఇష్టంగా తినడం నేర్చుకుంది. అట్లా అనతి కాలంలోనే ప్రజలకు ఆత్మీయురాలైంది. గత జీవితంలో పరమ భక్తురాలిగా వున్న

ఆమె భౌతికవాద దృక్పథాన్ని అలవర్చుకుంటూ తన అజ్ఞానాన్ని తొలగించుకుంది. కన్న పిల్లల్ని వదిలి వచ్చిన కామ్రేడ్ నవత ప్రజల వద్దకు వెళ్లినప్పుడు కనిపించిన ప్రతి చిన్నారిలో తన పిల్లల్నే చూసుకునేది. ఎత్తుకొని ముద్దాడి ప్రేమ కురిపించేది. తన దగ్గరున్న బిస్కెట్లో, మరోటో వాళ్లకు తినిపించి మురిసిపోయేది.

క్రమంగా తన చైతన్యాన్ని అభివృద్ధి పర్చుకుంటూ 2001లో పార్టీ సభ్యురాలిగా ఎదిగింది. ఉత్తర తెలంగాణాలో పనిచేసిన దాదాపు నాలుగేళ్ల కాలంలో ఆమె నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి, భీంగల్, సిరిసిల్లా, సిర్నాపల్లి దళాల్లో పనిచేసింది. ఆమె నిరంతరం ప్రజల సాధక బాధకాలను పట్టించుకునేది. వాళ్ల పోరాట చైతన్యాన్ని పెంచడానికి శాయశక్తులా కృషి చేసేది.

2003లో ఆమె తీవ్ర అనారోగ్యానికి గురైంది. అప్పటి ఎస్‌జడ్‌సీ సభ్యుడు కామ్రేడ్ రామకృష్ణ ఆమెను బయట ఒక షెల్టర్‌లో వుంచి చికిత్సకు ఏర్పాట్లు చేశాడు. టెక్నికల్ జాగ్రత్తల్లో భాగంగా ఆ షెల్టర్ వివరాలు జిల్లా కమిటీకి తెలుపలేదు. చికిత్స కొనసాగుతూ వుండగానే ఒక ఎన్‌కౌంటర్లో కామ్రేడ్ రామకృష్ణ అమరుడయ్యాడు. రేడియోలో ఆ వార్తను విన్న కామ్రేడ్ నవత వేదన వర్ణనాతీతం. గట్టిగా ఏడ్వడానికి కూడా అవకాశం లేని స్థితి. అమరత్వపు దుఃఖం ఒకవైపు, పార్టీ కాంటాక్టు తెగిపోయిన దిక్కుతోచని స్థితి మరోవైపు. అయినా ధైర్యం కోల్పోక విప్లవ ప్రజానీకం సహకారంతో ఆమె పార్టీ కాంటాక్టును పట్టుకోగలిగింది. ఆ తర్వాత మరికొద్ది కాలానికే ఆమె తిరిగి అనారోగ్యానికి గురైంది. కొద్ది కాలం పాటు విశ్రాంతి తీసుకోవాలనే వైద్య సలహా ప్రకారం పార్టీ ఒక నగరంలోని ఒక ముస్లిం కుటుంబం వద్ద ఆమెను వుంచింది. టెక్నికల్ సమస్య రాకుండా వుండడం కోసం పిల్లల్ని కూడా తనతో పాటే వుంచింది. భిన్నమైన సంస్కృతి అయినప్పటికీ ఆ కుటుంబంలో ఒక సభ్యురాలిగా కలిసిపోయి రెండు నెలల పాటు ఎటువంటి సమస్య రాకుండా మెసులుకుందామె.

## దండకారణ్య విముక్తి ప్రాంత నిర్మాణానికి రాళ్లెత్తిన 'కూలీ'

శత్రువు అనుసరించిన ఎల్ఐసీ ఎత్తుగడల ఫలితంగా ఉత్తర తెలంగాణా విప్లవోద్యమం తీవ్రంగా దెబ్బతిన్నది. ఉద్యమం ఆటులో వుందని 2003లో జరిగిన జోన్ ప్లీనం సమీక్షించింది. ఉద్యమ పరిస్థితికి అనుగుణమైన ఎత్తుగడలను రూపొందించుకుంది. అందులో భాగంగా అనేక మంది కామ్రేడ్స్ దండకారణ్యం (డీకే)కు బదిలీ అయ్యారు. అలా బదిలీ అయిన కామ్రేడ్స్‌లో కామ్రేడ్ నవతా, ఆమె సహచరుడూ వున్నారు. తమ బిడ్డల బాధ్యతను ఉత్తర తెలంగాణ వుద్యమానికి అప్పగించి

2003 డిసెంబర్‌లో వాళ్లిద్దరూ డీకేలో అడుగుబెట్టారు. డీకేలో మొదట కొన్నాళ్ల పాటు పశ్చిమ బస్తర్ డివిజన్‌లో వున్న కా।మేడ్ నవత 2005 ఆగస్టులో పార్టీ నిర్ణయం ప్రకారం దక్షిణ్ బస్తర్ డివిజన్‌లోని కిష్టారం ఏరియాకు చేరుకుంది. ఆమె పుట్టి, పెరిగి, పనిచేసిన ప్రాంతానికి దండకారణ్యం పూర్తిగా భిన్నమైనది. భౌగోళికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అన్నింట్లోనూ భిన్నత్వం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. వాటిని అర్థం చేసుకోవడానికి కృషి చేసింది. వాళ్లతో కలిసిపోయింది. ప్రజలనే గురువులుగా స్వీకరించి అక్కడి భాష నేర్చుకుంది. అక్కడి ఆహారపు అలవాట్లను అలవర్చుకుంది. మొదట కొన్నాళ్లు క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంగఠన్‌లో పని చేసింది. ఆమె ఎదుగుదలను, రాజకీయ, నిర్మాణపరమైన కృషిని దృష్టిలో పెట్టుకొని అక్కడి డివిజనల్ కమిటీ 2008లో ఆమెకు ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతి కల్పించింది. కిష్టారం ఏరియా కమిటీ సభ్యురాలిగా క్రాంతికారీ జనతన సర్కార్‌లో భాగమై నిర్దిష్టంగా వ్యవసాయ శాఖ బాధ్యతలను రెండేళ్ల పాటు నిర్వహించింది. ఆర్థిక వ్యవస్థను విప్లవీకరించే క్రాంతికారీ జనతన సర్కార్ల కృషిలో వ్యవసాయ శాఖ అత్యంత ప్రాముఖ్యతను కలిగినది. పురాతన సాగు పద్ధతులు అమలులో వున్న ఒక ఆదివాసీ ప్రాంతంలో అది క్లిష్టమైన కర్తవ్యంగా కూడా వుంటుంది. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చాలంటే ప్రజల ఆలోచనా సరళి, జీవన శైలిలోనే మార్పు తీసుకు రావాల్సి వుంటుంది. ఓపిగ్గా ప్రజలకు బోధించడం ద్వారా మాత్రమే అది సాధ్యం. మొత్తంగా అదొక పెద్ద రాజకీయ, సాంస్కృతిక పోరాటం అవుతుంది. కా।మేడ్ నవత ప్రజలకు ఓపిగ్గా అర్థం చేయించడానికి కృషి చేసేది. ప్రజల నుండి నేర్చుకుంటూనే ప్రజలను కార్యోన్ముఖులను చేసేది. తన ఆచరణ నుండి గ్రహించిన జ్ఞానాన్ని తను సభ్యురాలిగా వున్న కమిటీలకూ, తను బాధ్యత వహించే నిర్మాణాలకూ అందించేది. కమిటీల్లో నిర్ణయించుకున్న కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేయడానికి కృషి చేసేది. నేడు శత్రువు కొనసాగిస్తున్న నిర్బంధకాండ, అమలుచేస్తున్న ఎల్ఐసీ విధానాల్లో భాగంగా ఏరియా పరిధిలో వస్తున్న ప్రజా వ్యతిరేక, పార్టీ వ్యతిరేక మార్పుల్ని గమనించి తన కమిటీలో చర్చించేది. తన అభిప్రాయాలను స్పష్టంగా మాట్లాడేది.

కా।మేడ్ నవత మొదటి నుండీ బక్కగా, శారీరకంగా బలహీనంగా వుండేది. వయసు పెరుగుతున్న కొద్దీ మరికొన్ని ఆరోగ్య సమస్యలు తోడయ్యాయి. అయినప్పటికీ నిస్వార్థంగా, శక్తి వంచన లేకుండా పని చేసేది. ప్రజల్లో రాజకీయ కృషికి మాత్రమే పరిమితం కాకుండా వాళ్ల కష్ట సుఖాల్లో భాగమయ్యేది. రుతువుల వారీగా ప్రజలు చేసుకొనే వ్యవసాయ పనుల్లో, అటవీ ఉత్పత్తుల సేకరణలో భాగమవుతూ యువ

కార్యకర్తలకు అద్భుతమైన ప్రేరణగానూ, మార్గదర్శకంగానూ వుండేది. గ్రామాల్లో వ్యవసాయపు పనులు ముమ్మరంగా వుండి సమిష్టి వ్యవసాయ క్షేత్రాల్లో పని చేయడానికి ప్రజలు దొరకనప్పుడు ఒకరిద్దరు కామ్రేడ్స్ సహాయంతో కామ్రేడ్ నవత ఆ పనిలోకి దిగిపోయేది. ఇంత పెద్ద పని ఎలా చేయగలం అని ఆమె వెనకాడేది కాదు. పర్వతాలను తొలగించిన తెలివిమాలిన వృద్ధుడే ఆమెకాదర్శం. అట్లా ఆమె శ్రమించే తత్వాన్ని ప్రజలు, విప్లవ కార్యకర్తలు వింత వింతలుగా చెప్పుకునేవారు.

తనలో పొడచూపే రాజకీయ, నిర్మాణపర బలహీనతలను ఎప్పటికప్పుడు గుర్తించడంతో పాటు కమిటీ నుండి, కేడర్ నుండి వచ్చే సూచనలను, విమర్శలను వినయంగా స్వీకరించేది. వాటిని సరిదిద్దుకోవడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించేది. అదే విధంగా ఎదుటి కామ్రేడ్స్‌లో తను గుర్తించిన లోపాల గురించి సూచనలు, విమర్శలు చేయడంలో ఎటువంటి ఉదారవాదాన్ని ప్రదర్శించేది కాదు. తన రాజకీయ, నిర్మాణ దక్షతను పెంచుకోవడం కోసం సమయాన్ని కేటాయించుకొని రాజకీయ, సైద్ధాంతిక అధ్యయనం చేసేది. అధ్యయనం నుండి ఆచరణ నుండి తాను నేర్చుకున్న విషయాలను యువ కార్యకర్తలు కలిసినప్పుడు ఒక గురువుగా వాళ్లకు బోధించేది. ఒక తల్లిగా వాళ్లకు తన సుగుణాలను నూరిపోసేది.

తన ఆరోగ్యం సహకరించని పరిస్థితిలో కామ్రేడ్ నవత రెండు ఆర్‌పీసీలకు పరిమితమై పని చేసింది. క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంగఠన్ కార్యకర్తగా పనిచేస్తూ పితృస్వామ్యానికి, సామాజిక కట్టుబాట్లకు, రాజ్యహింసకు వ్యతిరేకంగా మహిళలను చైతన్యవంతం చేస్తూ, సంఘటితం చేసింది.

ఈ క్రమంలో ప్రజలతో ఆమె ఆత్మీయ అనుబంధాన్ని ఏర్పర్చుకుంది. తాను తిరిగే అన్ని గ్రామాల్లోనూ వృద్ధులకు బిడ్డయింది. తన తోటి వయసు వారికి అక్క అయింది. యువతరానికి అమ్మయింది. పసి పిల్లలకు అమ్మమ్మయింది. ఆమె ప్రజలకు ఆర్గనైజర్. మార్గదర్శి. గురువు. డాక్టర్. సలహాదారు.

ఆమె ప్రేమాస్పదురాలు. మృదు స్వభావి, స్నేహశీలి. అన్ని స్థాయిల పార్టీ శ్రేణులతోనూ సజీవ సంబంధాలు కల్గివుండేది. ఉన్నత స్థాయి నాయకత్వం నుండి సాధారణ సభ్యుల వరకూ పలువురు కామ్రేడ్స్ రాసిన కొన్ని ఉత్తరాలను ఆమె పదిలంగా భద్రపరుచుకున్నది. వాటిని చదివితే ఆ కామ్రేడ్స్‌తో ఆమెకున్న ఆత్మీయ అనుబంధం అర్థమవుతుంది.

పీడిత ప్రజల విముక్తి కోసం జరుగుతున్న ప్రజా యుద్ధంలో తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన అమర వీరుల ఫోటోలను ఆమె ఎప్పుడూ తన భుజానికి

తగిలించుకొనే బ్యాగులో పదిలంగా వుంచుకొనేది. తరచూ ఆ ఫోటోలను ఇతర కామ్రేడ్స్‌కు చూపిస్తూ వాళ్ల స్మృతులను పంచేది.

## నిర్బంధానికి వెరువని ధీరవనిత

ఇంటి వద్ద వున్నప్పుడే తీవ్ర నిర్బంధాన్ని అనుభవించిన కామ్రేడ్ నవత తీవ్ర నిర్బంధం నడుమనే పదహారేళ్ల కాలం దృఢంగా పని చేసింది. తెలంగాణాలో పని చేసిన నాలుగేళ్ల కాలం నిర్బంధం నిప్పులు చెరిగిన కాలం. ఉద్యమాన్ని నిర్మూలించే ఏకైక లక్ష్యంతో కేంద్ర అర్ధ సైనిక బలగాలూ, ఏపీ గ్రేహౌండ్స్ బలగాలు వేట కుక్కల్లా అడవులు, మైదానాలను జల్లెడ పడుతున్న సమయం. ముప్పయ్యేళ్ల వయసులో పీఎల్‌జీఏ సభ్యురాలయిందామె. ఎప్పుడూ వెన్నంటే అనారోగ్యంతో బలహీనంగా వుండేది. అయినప్పటికీ వీపున కిట్టు, జబ్బకు తుపాకీతో దళ ప్రయాణాలలో తోటి కామ్రేడ్స్‌తో పోటీ పడి నడిచేది. దళ కార్యక్రమాలకు ఆటంకంగా వుండకూడదనే పట్టుదలను, చైతన్యాన్ని అనుక్షణం ప్రదర్శించేది. తెలంగాణాలో పని చేసిన మూడేళ్ల కాలంలో ఆమె ఏడు ఎన్‌కౌంటర్లను ఎదుర్కొన్నది. కామారెడ్డి ఏరియాలో సిర్నపల్లి గ్రామం వద్ద రెండు సార్లు వాళ్ల దళం పోలీసు దాడులకు గురైంది. అదే విధంగా మద్దికుంట, గోవిందపల్లి, సిరిసిల్లా ఏరియాలోని మరిమడ్ల, గజ్జరాళ్లగుట్ట వద్ద, భీంగల్ ఏరియాలోని మానాల వద్ద జరిగిన శత్రు దాడులలో ఆమె వెంట్రుకవాసిలో మృత్యువును తప్పించుకున్నది. ఆమె ఎదుర్కొన్న దాడులన్నింటిలోకి సిర్నపల్లి వద్ద జరిగిన రెండవ దాడి అతి పెద్దది. ఈ దాడిలో సాయంత్రం మూడు గంటల నుండి రాత్రి పది గంటల వరకూ కొన్ని కిలోమీటర్ల పరిధిలో మూడు దఫాలుగా కాల్పులు జరిగాయి. ఈ దాడిని ఎదుర్కొన్న దళంలో కామ్రేడ్ న్యాలకొండ రజిత (పద్మక్క పేరుతో ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా పనిచేస్తూ శత్రు దాడిలో అమరురాలయింది), కామ్రేడ్ నవతతో పాటు మొత్తం పన్నెండు మంది కామ్రేడ్స్ వుండినారు. మొదటి ఫైరింగ్‌లోనే ఎనిమిది మంది ఒకవైపు విడిపోగా కామ్రేడ్స్ పద్మ, నవతలతో పాటు నలుగురు మరో టీంగా విడిపోయారు. ఈ నలుగురి టీం రిట్రీట్ అవుతున్న దిశను గుర్తించిన గ్రేహౌండ్స్ బలగాలు అడ్డం తిరిగి కిలో మీటర్ దూరంలో మరొక దాడి చేశాయి. ఈ దాడిని తిప్పికొడుతూ రిట్రీట్ అవుతున్న క్రమంలో ఇద్దరు కామ్రేడ్స్ విడిపోగా కామ్రేడ్స్ పద్మ, నవతలు ఇద్దరే మిగిలారు. వీళ్లిద్దరే కాల్పులు జరుపుతూ రిట్రీట్ అయ్యి మరో కిలోమీటర్ దూరంలో వున్న చెరుకు తోటలో తలదాచుకున్నారు. ఇది పసిగట్టిన శత్రు బలగాలు తోటను చుట్టుముట్టి సాయంత్రం

అయిదు గంటల నుండి రాత్రి పది గంటల వరకూ ఎడతెరిపి లేకుండా కాల్పులతో పాటు బాంబుల వర్షం కురిపించారు. అయినప్పటికీ ఆ చెరుకు తోట ఎక్కువ విస్తీర్ణంతో, దట్టంగా వుండడం వల్ల వాళ్లకు ప్రాణనష్టం జరగలేదు. అయితే శత్రువు విసిరిన గ్రెనేడ్ పేలుళ్లలో కామ్రేడ్ నవతకు స్వల్పంగా గాయాలయ్యాయి. రాత్రి పది-పన్నెండు గంటల మధ్య శత్రు బలగాలు తాత్కాలికంగా దాడిని ఆపి భోజనాలు చేస్తున్న సమయంలో చీకటి మాటున ఈ కామ్రేడ్సిద్దరూ శత్రు వలయాన్ని ఛేదించారు. అయితే శత్రు వలయం నుండి బయట పడిన కొద్ది సేపటికే వీళ్లిద్దరూ కూడా అనుకోకుండా వేరు పడి చెరో దారి అయ్యారు. అప్పటికి ఆ ప్రాంతం ఇద్దరి కామ్రేడ్స్‌కూ కొత్తే. ఎక్కువ పరిచయాలు లేవు. అయినప్పటికీ పోరు ప్రజల మీది భరోసాతో ఇద్దరూ చెరో గ్రామానికి చేరుకున్నారు. కామ్రేడ్ పద్మ నల్లబెల్లి గ్రామానికి చేరుకుంటే, కామ్రేడ్ నవత సిర్నాపల్లి గ్రామానికి చేరుకుంది. ఇద్దరు కామ్రేడ్స్‌నూ ఆప్యాయంగా తమ ఒడికి చేర్చుకున్న ఆ గ్రామాలు రెండు రోజులు కంటికి రెప్పలా కాపాడుకొని ఆ తర్వాత పార్టీకి అప్పగించాయి. ఆనాడు ఆ గ్రామంలో చవిచూసిన ప్రేమానురాగాలను ఆ తర్వాత అమరత్వం చెందిన కామ్రేడ్ పద్మక్క స్మృతులను కామ్రేడ్ నవత తరచూ స్మరించుకునేది. ఆ దాడిలో ఆమె శరీరంలోకి దిగిన గ్రెనేడ్ ముక్కలను స్థానిక వైద్యులు తొలగించి చికిత్స చేశారు.

ఉత్తర తెలంగాణాలో తీవ్ర నిర్బంధాన్ని అనుభవించిన కామ్రేడ్ నవత దండకారణ్యం ఒడిలోకి చేరిన కొద్ది కాలానికే బీభత్సకరమైన సల్వాజుడుం దాడి మొదలైంది. ఆ తర్వాత అంతకంటే తీవ్రమైన గ్రీన్‌హంట్ బహుముఖ దాడి మొదలైంది. ఈ దాడుల మధ్యనే ఆమె నిరాయుధంగా ప్రజలనే ఉక్కుకోటగా భావించి నిబ్బరంగా పని చేసింది. శత్రు విధ్వంసం మధ్యనే ధైర్యంగా జనతన సర్కార్లు చేపడుతున్న పునర్నిర్మాణ కార్యక్రమాల్లో, ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొన్నది. కిష్టారం ఏరియాలోని తిమ్మాపురం, కేడ్వాల్ గ్రామాల వద్ద ఆమె రెండు సార్లు శత్రు దాడికి గురైంది. ఈ రెండు సందర్భాల్లోనూ ఇతర కామ్రేడ్స్‌తో పాటు చాకచక్యంగా తప్పుకుంది.

శత్రు నిర్బంధాన్ని, ప్రస్తుత గడ్డు పరిస్థితిని అర్థం చేసుకోలేక స్వార్థ ప్రయోజనాలతో ప్రజలకూ, విప్లవానికి ద్రోహం చేస్తూ కొంత మంది శత్రువు ముందు మోకరిల్లుతున్న పరిస్థితిలో కామ్రేడ్ నవత తీవ్ర అనారోగ్యం వెంటాడుతున్నా తనలోని బోల్షివిక్ స్ఫూర్తిని చెక్కుచెదరనివ్వక కడ ఊపిరి వరకూ దృఢంగా విప్లవోద్యమంలో ముందుకు సాగింది.

తన అనారోగ్యం విషమించి ఇక తనకు మరణం తప్పదని అర్థమయిన తర్వాత

సమీపంలో వున్న కామ్రేడ్సందరిరీ తన చెంతకు పిలుచుకొని "రేపటి నిర్బంధం మరింత తీవ్రంగా వుంటుంది. మరింత జాగ్రత్తగా, ధైర్యంగా దాన్ని ఎదుర్కోవాలి" అని చివరి వీడ్కోలు చెప్పిన సాహసి.

## అనురాగం, మమకారం మూర్తీభవిస్తే అమ్మ

కామ్రేడ్ నవత వృత్తి విప్లవకారిణిగా మారిన తర్వాత పిల్లలిద్దర్నీ వాళ్ల అమ్మమ్మ, తాతల దగ్గర సంవత్సరం పాటు వుంచారు. అయితే భవిష్యత్‌లో పిల్లలిద్దరూ విప్లవోద్యమంలోకి రావాలంటే అందుకు అనుగుణమైన పెంపకం వుండాలని భావించి పిల్లలను పార్టీ సంబంధాల్లో వున్న కుటుంబం వద్ద వుంచారు. తల్లిదండ్రులిద్దరూ డీకేకు వెళ్లిపోయిన తర్వాత నిర్బంధం కారణంగా పిల్లలకు ఉత్తర తెలంగాణా పార్టీ కాంటాక్టు తెగిపోయింది. శ్రద్ధగా వాళ్ల ఆలనా పాలనా చూసేవాళ్లు లేకుండా పోయారు. రెండేళ్లు పిల్లల్ని కలువలేక ఇటు తల్లి పడిన ఆవేదనా, తల్లిదండ్రులకు, అయిన వాళ్లకు దూరమై అటు పిల్లలు గురైన మానసిక క్షోభా వర్ణనాతీతం. ఆ మానసిక క్షోభను తట్టుకోలేని ఆమె బిడ్డ తీవ్రమైన మూర్ఛవ్యాధికి గురైంది. అటువంటి పరిస్థితిలో 2005లో పిల్లల్ని కూడా ఆ తల్లిదండ్రులు తమ వద్దకే పిలుచుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో చావు బతుకుల మధ్య తన ఒడిలోకి చేరిన బిడ్డను చూసి ఆ తల్లి మనసు విలవిలలాడింది. తల్లి పంచిన ప్రేమ, చేసిన సేవలు, చేకూర్చిన సాంత్వన ఆ బిడ్డకు పునర్జన్మనిచ్చాయి. అనారోగ్యంతో బలహీనంగా వున్న బిడ్డ, పద్నాగేళ్లయినా నిండని కొడుకుల భవిత గురించి ఆలోచించిన ఆ తల్లిదండ్రులు వాళ్లను మళ్లీ బయటికి పంపడం కంటే గెరిల్లా జీవితంలోకే ఆహ్వానించాలనుకున్నారు. తల్లిదండ్రుల ప్రతిపాదనను పిల్లలు సంతోషంగా అంగీకరించారు. బడిని వదిలేసి పోరుబడిలో చేరారు. అయితే ఆ పిల్లలను ఏ రంగంలో, ఏ ప్రాంతంలో వుంచాలనే విషయంలో అందరూ ఆమె అభిప్రాయం కోసమే చూశారు. చిన్న పిల్లలు అయినప్పటికీ వాళ్లు తనతో వుండడం కంటే వేరుగా వుండడం ద్వారానే వాళ్ల అభివృద్ధికి, స్వతంత్ర ఎదుగుదలకు ఉపయోగపడుతుందని గుర్తించిందామె. తనను మించిన తల్లి పార్టీయే అని భావించింది. బిడ్డ ఆరోగ్యం కొంత కుదుట పడ్డ తర్వాత పిల్లలను ఇతర డివిజన్లకు, ఇతర కార్యక్షేత్రాలకు వెళ్లి పని చేయడానికి సాగనంపింది. ఆ తర్వాత గడిచిన ఈ పదేళ్ల కాలంలో పిల్లల్ని అప్పుడప్పుడు కలుస్తూ, ఉత్తరాలు రాస్తూ తల్లిగా ప్రేమానురాగాలను పంచింది. అనుభవజ్ఞురాలైన ఒక కామ్రేడ్‌గా వాళ్లకు సలహాలు, సూచనలు ఇచ్చింది. ఒక గురువుగా వాళ్లకు పోరు పాఠాలు నేర్పింది. వాళ్ల తప్పులను

దిద్దింది. వాళ్లను ఆదర్శవంతమైన విప్లవకారులుగా తీర్చిదిద్దడానికి కృషి చేసింది. వాళ్లు తమ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తుంటే సంతృప్తిపడింది.

కామ్రేడ్ నవత తన జీవిత సహచరుడికి 'మనసున మనసై బ్రతుకున బ్రతుకై' నిలిచిన తోడు-నీడ. పరస్పరం ప్రేమ, అనురాగం, సహకారం, గౌరవం, విశ్వాసం, విమర్శ-స్వయం విమర్శ కలిగి వుండిన ఆదర్శ దాంపత్యం వాళ్లది.

కుటుంబమే మహిళల పరమావధిగా భావించే పితృస్వామ్య సమాజం మహిళను ఒక మంచి గృహిణిగానూ, ఒక మంచి తల్లిగానూ తీర్చిదిద్దాలని చూస్తుంది. ఒక మహిళ భర్తనో, కొడుకునో వీరులుగా ఆ సమాజం గుర్తిస్తే, ఆ మహిళను వీరపత్నిగానో, వీరమాతగానో కొనియాడుతుంది. ఆ బిరుదులతోనే వాళ్లను సంతృప్తిపడమంటుంది. కానీ నాలుగుగోడలకే పరిమితమై వీరపత్నులుగానో, వీరమాతలుగానో మిగిలిపోవడం ఇష్టంలేని ఎందరో మహిళలు తమ చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చుతూ వీరనారులుగా చరిత్రలో తమను తాము నమోదు చేసుకుంటున్నారు. అదే కోవలో కామ్రేడ్ నవత తాను వీరపత్నిగా మాత్రమే మిగిలిపోనని వీరనారిగా కదన రంగంలో దూకింది. పిల్లల్నీ వేలుపట్టి విప్లవ మార్గంలోకి నడిపించి వీరమాత అనిపించుకుంది. సంకుచిత కుటుంబ చట్రాన్ని ఎల్లలు లేని విప్లవ కుటుంబంగా మలిచింది.

## సహచరుల హృదయాల్లో చెరగని ఆత్మీయ ముద్ర

కామ్రేడ్ నవత అమరత్వం తర్వాత ఆమె సహచరుడినీ, పిల్లలనూ ఓదార్చుతూ పలువురు కామ్రేడ్స్ రాసిన వుత్తరాల్లోని కొన్ని అంశాలను తడుముకుంటే సహచరుల మనసుల్లో ఆమె ఎలా ముద్రించుకుపోయిందో బోధపడుతుంది.

"ఎందరో విప్లవంలోకి రావడానికి కుటుంబం, పిల్లలు అంటూ వెనకాడుతుంటే, వచ్చిన వాళ్లు కొంతమంది కుటుంబం, పిల్లలు అంటూ వెనక్కి పోతుంటే తను గుండె ధైర్యంతో, నిబ్బరంగా, నిస్వార్థంగా ప్రజల కోసం ప్రాణాలివ్వడానికి ముందుకొచ్చింది. తనకు వచ్చిన వ్యవసాయ పనిని ప్రజలకు నేర్పుతూ మనందరికీ ఆదర్శంగా నిలిచింది. కొంత మంది ఆ వయసులో అటువంటి పనులు చేయలేమని వెనుకాడుతుంటే తను మాత్రం ఎంత కష్టాన్నయినా లెక్కచేయకుండా తన అనారోగ్యాన్ని లెక్క చేయకుండా పని చేస్తుండేది. తెలంగాణా దళాలు తానున్న గ్రామాల నుండి పోతూ వుంటే కామ్రేడ్ నవతక్క ఉరుకులు పరుగులతో ప్రజలతో కలిసి పని చేయడం కనిపించేది. ఆమెను చూసి మేం కూడా కొంత సేపు ఆ పనిలో సహకరించే వాళ్లం."

"సాధారణ గృహిణిగా మొదలయిన నవత జీవితం ఒక విప్లవకారిణిగా, ప్రజల

మనిషిగా ఉన్నత శిఖరాలకు ఎదిగింది. తను పూర్తికాలం ఉద్యమంలో పనిచేయడమే కాక పిల్లల్ని కూడా ఉద్యమానికి అంకితం చేసింది. ఏరియాలో ప్రజలతో లతలా అల్లుకుపోయింది. నవత ఎప్పుడు కలిసినా గ్రామంలోని ప్రజల సమస్యలు, ముఖ్యంగా మహిళల సమస్యలు గురించి చెప్పేది. వర్గ దృక్పథాన్ని ఎప్పుడూ విడువలేదు. పేద కుటుంబాల గురించి, వారి కష్టాల గురించి చెప్పేది. వారి కష్టాలు, బాధలు తనవిగానే భావించేది. కన్న పిల్లల్నే కాక, అందర్నీ తన పిల్లల్లాగే ప్రేమించేది. మొన్న మేం దక్షిణ్ బస్తర్‌లో కిష్టారం ఏరియాలో ఒక దగ్గర క్లాసు చెప్పడానికి వెళ్లాం. ఆ దగ్గరి గ్రామంలో ఒక గర్భిణీ మహిళను పాము కాటేసింది. ఆ అమ్మాయి తల్లి నవతను పట్టుకొని 'నా బిడ్డను కాపాడండి' అని ఏడుస్తుంటే, ఆమెను ఓదార్చుతూ మా దగ్గరికి కబురు పంపింది. ఆ తల్లి బాధ తన బాధే అయ్యింది. నవత ఎప్పుడూ అనేది 'మీరు ఎక్కువగా అడవిలో డేరాలో వుంటారు కనుక మీకు ప్రత్యక్షంగా ప్రజల బాధలు తెలియవు. నేను ఎప్పుడూ వారి ఇళ్ల దగ్గర వుండి చూస్తాను కనుక వాళ్ల సమస్యలు అర్థం అవుతాయి. ఒక్కొక్కసారి అన్నం కూడా తినబుద్ధి కాదు' అని అనేది. ఆ పాము కరిచిన అమ్మాయిని మన కామ్రేడ్స్ వెంటనే ప్లాన్ చేసి హాస్పిటల్‌కి పంపారు. ఆ అమ్మాయి క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చింది. ఆ అమ్మాయి తల్లి మనసు కుదుటపడ్డట్లే నవత మనసు కూడా కుదుటపడి వుంటుంది."

"తన కష్టాలకీ, బాధలకి కారణం పార్టీ అనో, నువ్వనో అనుకోకుండా కారణాన్ని ఈ దోపిడీ వ్యవస్థలో చూసింది. ఈ కష్టాలకి పరిష్కారంగా పార్టీ బాట పట్టింది. భర్తకి భార్యగానే కాక, నిజంగా ఈ రాజకీయాలను తను విశ్వసించింది. నవతలో ఈ పరిణితికి, పరిణామానికీ నీ సహకారం, నిరంతర రాజకీయ కృషి వున్నయనేది ఎంత వాస్తవమో, ఈ రాజకీయాలను ఆమె మనస్ఫూర్తిగా నమ్మి తన జీవితాన్ని ప్రజల కోసం అర్పించింది అనేది కూడా అంతే వాస్తవం."

"నవత మంచి విమర్శకురాలు. ఏ విషయాన్ని అయినా, నిరంతరం పరిశీలించడం, విమర్శించడం వుండేది. నవ్వుతూనే పదునుగా విమర్శించేది. జీవితంలో ఎన్ని కష్టాలు, కడగండ్లు వచ్చినా గానీ చివరి వరకూ నమ్మిన రాజకీయాలను అంటిపెట్టుకోవడంలో, తెలంగాణా నించి వచ్చి ఇక్కడి ఆదివాసీ ప్రజలలో తలలో నాలుకలా కలిసిపోవడంలో అందర్నీ తన పిల్లలుగా ప్రేమించడం, ప్రజలకు సేవ చేయడంలో కామ్రేడ్ నవత నుండి అందరం నేర్చుకోవాల్సే వుంది.

నవత ఎంతగా ప్రజల్ని సొంతం చేసుకుందంటే తను చనిపోతే పొట్టెమంగుం వూరిలోనే అంతిమ సంస్కారం జరగాలని కోరుకుంది. అక్కడి స్థానిక పార్టీ కామ్రేడ్స్,

ప్రజలు తనని తమ మనిషిగా, ఇంట్లో మనిషిగా చూశారు. ఆ గ్రామస్తుడు ఒకాయన అనారోగ్యంతో చనిపోయినప్పుడు కామ్రేడ్ నవత చాలా బాధపడింది. అతను తనను చెల్లెలా చూసుకునేవాడని చెప్పింది నాతో."

"మీది ఒక ఆదర్శవంతమైన విప్లవ కుటుంబం. ఆత్మీయతతో నిండిన 31 సంవత్సరాల సహజీవనం. మీ కుటుంబాన్ని చూసి నేను చాలా ప్రేరణ పొందాను. నేను ఇంటి దగ్గర చదివిన 'నా కుటుంబం' నవల నాకు బాగా గుర్తొస్తా వుంటది. కామ్రేడ్ నవతక్క తన జీవితంలో ఎన్నో కష్టాలను, కన్నీళ్లను, ఆవేదనలను చిరునవ్వుతో భరిస్తూ వాటినన్నింటినీ ధైర్యంగా అధిగమించింది. విప్లవంలో నేను సైతం అంటూ తన కర్తవ్యాన్ని నిస్వార్థంగా నిర్వర్తించి తన ఆచరణే మనకో ఆదర్శంగా అందించి ఈ అనంత విశ్వంలో మెరిసే తారై నిరంతరం మనకు వెలుగును పంచుతూనే వుంటుంది."

"ప్రజల మధ్య, భార్యా భర్తల మధ్య గొడవలు వస్తే కామ్రేడ్ నవతక్క కూర్చోబెట్టి ఓపికతో మాట్లాడి వాళ్లను ఒక్కటి చేసేది. కిష్టారం ఏరియాలో ప్రతి ఇంటిపై, ప్రతి మనిషిపై ముద్ర వేసిన కమ్యూనిస్టు యోధురాలు మన కామ్రేడ్ నవతక్క లోటు, ప్రజలకు, మనకు తీరనిది."

"2006లో నేను మొదటిసారి నవతక్కను, పిల్లల్ని కల్సిన. మీ కుటుంబం నన్ను చాలా ఇన్‌స్పైర్ చేసింది. ముఖ్యంగా తన భర్తా, పిల్లలు, సంసారం... ఇట్లా గిరిగీసుకొని బతికే సగటు గృహిణిగా వుండిన అక్క ఒక కఠినమైన వర్గ పోరాటంలో ప్రత్యక్షంగా భాగస్వామి కావడం ఎంత గొప్ప విషయం అనుకునేదాన్ని. అక్కతో పరిచయం పెరుగుతున్న కొద్దీ తన ప్రేమ, ఆప్యాయత, నిస్వార్థం, ఆశయం పట్ల దృఢ సంకల్పం, అనారోగ్యాన్ని లెక్కచేయకుండా, ప్రజల కోసం ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొనే సంసిద్ధత... ఇవన్నీ తన పట్ల నాకు గౌరవాన్నీ, అభిమానాన్ని మరింత పెంచినయి.

ఇక మీ ఇద్దర్నీ కలిసి చూసిన తర్వాత 'మనసున మనసై బ్రతుకున బ్రతుకై' అనే పాటకు మీ ఇద్దరి సహచర్యం ఒక సజీవమైన నిర్వచనం వంటిదనిపించేది. కొంత మంది కామ్రేడ్స్ తమ జీవిత సహచరుల పట్ల విమర్శనాత్మకంగా వుండరు. కానీ మీ ఇద్దరూ ఒకరి పట్ల ఒకరు ఎంతో ప్రేమగా వుంటూనే, విమర్శనాత్మకంగా కూడా వుండడం వల్ల మీ సహజీవనం మరింత అర్థవంతంగా, విలువైనదిగా, నూటికి నూరు పాళ్లూ రాజకీయమైనదిగా, ఒక ఆదర్శవంతమైన నమూనాగా నిలిచింది.

అక్క నీ కారణంగానే విప్లవోద్యమంలోకి, ముఖ్యంగా ప్రజా యుద్ధంలోకి

వచ్చింది. నా కారణంగా ఇటువంటి కష్టభరితమైన జీవితాన్ని ఎంచుకొంది అనే భావన నీ మనసులో తప్పకుండా ఉండే వుంటుంది కానీ దాన్నెప్పుడూ నువ్వు బహిరంగంగా, ముఖ్యంగా ఇతరుల ముందు వ్యక్తపరిచేవాడివి కాదు. విప్లవోద్యమంలోకి తను రావడం అనేది ఏ ప్రత్యేకతా లేని విషయంగా తన సామాజిక బాధ్యతను తాను నెరవేర్చుతున్నది అన్నంత సాధారణంగా, సహజంగా నీ ప్రవర్తన వుండేది. అక్కలో కూడా ఈయన మూలంగా నేను ఇన్ని కష్టాలు పడుతున్నాను అన్న భావన ఎప్పుడూ కనిపించేది కాదు. తన బాధ్యత తాను నెరవేర్చుతున్నట్టుగానే వుండేది. కొంత మంది మహిళా కామ్రేడ్స్ నాయకుల జీవిత సహచరులుగా గుర్తింపును కోరుకుంటారు. కానీ అక్కలో లేశమాత్రం కూడా ఆ భావన వుండేది కాదు. ఒక సాధారణ కార్యకర్తగా, ప్రజలకు నిజమైన సేవకురాలిగా తనను తాను భావించుకొంది. అట్లే పని చేసింది. ఎంతో రాజకీయ చైతన్యమూ, పరిణితి వుంటే తప్ప ఇది సాధ్యం కాదు. ఒక వ్యక్తిగత సంబంధంగా, ఒక సంకుచితమైన కుటుంబ చట్రంలో మొదలైన మీ యిద్దరి సహజీవనం ఒక విశాలమైన, చైతన్యవంతమైన కామ్రేడ్లీ సంబంధంగా మారిన పరిణామక్రమం మీ ఇద్దరి వ్యక్తిత్వాల్లోని ఔన్నత్యాన్నే కాక ఇటువంటి వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుతున్న విప్లవోద్యమ గొప్పతనాన్ని ప్రజలకు చాటుతుంది.” ✶

“చావుకు తెగించి మనల్ని ఈ ప్రపంచంలోకి తీసుకొచ్చి, మనకూ ప్రపంచానికీ మధ్య అనుసంధాన కర్తగా మారి ఈ ప్రపంచాన్ని మనకు పరిచయం చేసి, మన చేతిలో ఈ ప్రపంచాన్ని పెట్టి, మనమే ప్రపంచంగా బతికే అమ్మకు సాటి రాగలిగింది ఈ ప్రపంచంలో ఇంకేమీ వుండదు కదా. అటువంటి అమ్మను కోల్పోయి మీరెంత కలత చెందుతూ వుంటారో తలచుకున్నప్పుడల్లా హృదయం భారమవుతున్నది.

నిజానికి అమ్మ మీ ఇద్దరికే అమ్మగా పరిమితం కాలేదు. నా భర్తా, పిల్లలు అనే సంకుచిత కుటుంబ చట్రాన్ని ఛేదించుకొని విప్లవోద్యమంలో అడుగుపెట్టి అమ్మగా ఎంత మందికి తన ప్రేమను, ఆప్యాయతను పంచిందో. నాకంటే వయసులో చాలా పెద్దది కాకపోయినప్పటికీ నాకు కూడా తను అమ్మలా ప్రేమను పంచింది. అట్లా చూసుకుంటే ఈ బాధ మీది మాత్రమే కాదు. మీరే కాదు, నేను, ఇంకా మరెందరమో ఒక నిస్వార్థ ప్రేమమూర్తిని కోల్పోయాం.”

“2006 ఎండాకాలంలో నేను మొదటిసారి అమ్మను చూసింటి. ఈ వయసులో విప్లవోద్యమంలోకి వచ్చి పిల్లల్ని కూడా విప్లవకారులుగా తీర్చిదిద్దుతున్న తనను చూసి నేనెంతో ప్రేరణను పొందాను. ఒక అమ్మగా, ఒక విప్లవకారిణిగా రెండు కోణాలను చూసిన తనలో. రెండు పాత్రల మధ్య అప్పుడప్పుడు తను పడే ఘర్షణను కూడా

కొంతమేరకు అర్థం చేసుకున్న.

అనారోగ్యం నిరంతరం వేధిస్తూ వున్నా, తీవ్ర నిర్బంధంలో నాన్న క్షేమం, మీ క్షేమం గురించిన ఆందోళన వెంటాడుతూ వున్నా తను ఎంతో దృఢంగా కడ ఊపిరి దాకా విప్లవోద్యమంలో నిలబడింది. అనారోగ్యం రీత్యానైనా, వయసు రీత్యానైనా ఏ ప్రత్యేకతలూ కోరుకోకుండా నిస్వార్థంగా, నిజమైన ప్రజా సేవకురాలిగా తనను తాను మలచుకొంది. విప్లవకారిణిగానే కాదు, అమ్మగా, నాన్నకు జీవిత సహచరిగా అన్ని పాత్రలను తాను ఎంతో ఆదర్శవంతంగా నిర్వహించింది."

**ఆదర్శ కమ్యూనిస్టు**

ఇలా అత్యంత సాధారణంగా పుట్టి, పెరిగి, సాధారణ గృహిణిగా జీవితాన్ని ప్రారంభించిన కామ్రేడ్ నవత తన ముందు తెరుచుకున్న 'మరో ప్రపంచపు' దారిలో ధైర్యంగా అడుగుపెట్టి తడబడకుండా, వెనుతిరిగి చూడకుండా మునుముందుకు సాగిపోయి, తన పిల్లల్ని కూడా పోరు తల్లి ఒడిలోకి చేర్చిన స్ఫూర్తిదాయని. ప్రజల, ఉద్యమ కార్యకర్తల హృదయాల్లో ఎన్నటికీ చెరిగిపోని ఆత్మీయ ముద్ర కామ్రేడ్ నవత.

ఎటువంటి కష్టాలనైనా నిబ్బరంగా ఎదుర్కొని బోల్షివిక్ స్ఫూర్తితో దృఢంగా ముందుకు సాగడం, శక్తి వంచన లేకుండా శ్రమించడం, తోటి కామ్రేడ్స్‌ను, ప్రజలను ప్రేమించడం, నిస్వార్థంగా ప్రజలకు సేవచేయడం, ప్రజలతో నీటిలో చేపలా కలిసిపోవడం, సాదాసీదాగా జీవించడం వంటి ఉన్నత విలువలను తన విప్లవ జీవితమంతా ఆచరించి ఒక ఆదర్శ కమ్యూనిస్టుగా చరిత్రలో నిలిచిపోయింది కామ్రేడ్ నవత. ఆ ఆదర్శాలను మన జీవితాలకు అన్వయించుకోవడమే ఆ విప్లవ మూర్తికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

కామ్రేడ్ నవత అమర్ రహే!

అమర వీరుల ఆశయాలను కొనసాగిద్దాం!

# ఆదర్శ వీర వనిత
# కామ్రేడ్ నవతకు విప్లవ జోహార్లు

కామ్రేడ్ ఆయిల సులోచన (నవత) 44 ఏండ్ల వయసులో 2015 జూన్ 3న దండకారణ్యంలోని దక్షిణ్ బస్తర్ డివిజన్, కిష్టారం ఏరియాలో తీవ్రమైన మలేరియా జ్వరంతో కనుమూసింది. అమరత్వం నాటికి ఆమె కిష్టారం ఏరియా కమిటీ సభ్యురాలిగా పని చేస్తున్నది. ఏ ప్రజల కోసం కామ్రేడ్ నవత కొన ఊపిరి వరకూ పని చేసిందో ఆ ప్రజల మధ్యనే ఆమె తుది శ్వాస విడిచింది. ఒక సాధారణ గృహిణి జీవితం నుండి అత్యున్నత విప్లవ మార్గాన్ని ఎంచుకొని కొన ఊపిరి వరకూ ఆ మార్గంలో దృఢంగా పయనించి ఆదర్శవంతమైన ఆచరణతో ప్రేమ పూరిత స్వభావంతో ఎందరో కామ్రేడ్స్‌పైనా, ప్రజలపైనా ఆత్మీయ ముద్రను వేసి, స్ఫూర్తి దాయకంగా నిలిచి పోయిన వీరనారి కామ్రేడ్ నవత. ఆమె మరణ వార్త తెలిసిన పార్టీ, పీఎల్‌జీఏ శ్రేణులు, ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. వందలాది సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు అశ్రు నయనాలతో ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆమె ఆదర్శాలను ఎత్తిపట్టారు. ఆమె అమరజీవి అని నినదించారు. సీపీఐ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, పీఎల్‌జీఏ, క్రాంతికారీ జనతన సర్కార్, విప్లవ ప్రజా సంఘాలు తలవంచి వినమ్రంగా నివాళి అర్పిస్తున్నాయి. ఆమె ఆశయ సాధనలో మును ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేస్తున్నాయి.

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ**

స్మృతులు

# కామ్రేడ్ నవతా!

నిన్ను, మన పిల్లల్ని కలుసుకోవడానికి ఈ మధ్య కాలంలో ఉద్యమ అవసరాల రీత్యా కొంత లేటయినా చివరికి మనందరిని కలుసుకొమ్మని మనకు ఓ మంచి అవకాశం పార్టీ పనుల్లో ప్లాన్ జరుగడంతో మిమ్ముల్నందరిని కలుసుకుంటాననే ఉత్తేజంతో ఎంతో ఆశతో సుదీర్ఘ ప్రయాణం చేస్తూ మనం కలుసుకునే కాంటాక్టు ప్లేసుకు, చేరుకుంటున్న క్రమంలో నాలో మీ అందర్నీ ఒక్క క్షణంలో చూడబోతున్నాననే ఉత్తేజం మరింత పెరిగింది. కాని చివరకి కాంటాక్టు ప్లేస్‌లో మీరు ఎవరూ కలువకపోగా నాలో పొంగివచ్చిన ఉత్తేజాన్ని ధ్వంసం చేస్తూ వచ్చిన 4/6 నాటి నీ అమరత్వం వార్త వినగానే నాగుండె ఒక్కసారి దుఃఖంతో నిండిపోయింది రమా! మన వైవాహిక జీవితంలోని నీ జీవిత గాథలన్నీ ఒక్కసారి నా కళ్లల్లో సుడులు తిరిగాయి రమా. ఇంటివద్ద నీవు అత్త మామలతో (నేను పార్టీలోకి వచ్చిన తర్వాత) ఎదుర్కొన్న కష్టాలు, నీ తల్లిదండ్రులు కూడా నీకు సహకరించని సమయంలో నీవు పడ్డ బాధలు, పోలీసుల వేధింపులు ఎదుర్కొన్న నీ జీవిత గాథలన్నీ కళ్ల ముందు తిరగసాగాయి రమా! పిల్లల పోషణ, చదువులకు ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ బతకడం కన్నా పిల్లలకు విషం పోసి, నీవు విషం తాగి చనిపోతానని భరించలేని నీ బాధలన్నీ గుర్తుకొస్తే గుండె రగిలిపోతుంది. కుటుంబ, సమాజ బాధలే చివరికి నిన్ను విప్లవం వైపు మల్లించి దోపిడీ సమాజంపై అసహ్యాన్ని, కసిని రగిలించి సమాజ మార్పు కోసం పయనించిన నీ మార్గం నాకు ఎంతో ఉత్తేజాన్ని, సత్తువనిచ్చింది. నీవు విప్లవంలోకి అడుగుబెట్టిన నాటి నుండి కానీ లేక మన వైవాహిక జీవితం మొదలైన నాటి నుండి మన మధ్యలో ఎలాంటి సమస్యలు లేకుండా అన్యోన్య బంధంలా సాగిన మన వైవాహిక జీవితం గుర్తుకొస్తాంది. ఉప్పొంగుతున్న దుఃఖాన్ని అదిమిపట్టేందుకు ఎంత ప్రయత్నించినా కన్నీళ్లు వుబికి వస్తున్నాయి. కామ్రేడ్ నవతా ఈ క్రూర రాజ్య నిర్బంధం వల్లా చివరి క్షణంలోనైనా నీ కడసారి చూపును కూడా చూడ నోచుకోలేకపోతున్నందుకు గుండె రగిలిపోతుంది. ఏది ఏమైనా కామ్రేడ్ నవతా నీ గొంతులో ఊపిరి ఉన్నంత వరకు ఈ వర్గ రహిత సమాజ స్థాపన మార్గాన్ని

వదలనని నా ముందు నీవు చేసిన శపథాన్ని నీ మాటలతో కాక నేటి నీ అమరత్వం ద్వారా నిరూపించుకున్నావ్ గదా. నువ్వు పడ్డ కష్టాలు, బాధలు, మన మధ్యలో మొదటి నుండి చివరి వరకు ఏలాంటి సమస్యలు లేకుండా పెనవేసుక పోయిన మన గాఢమైన వైవాహిక బంధం...నేడు నన్ను దుఃఖంలో ముంచెత్తగా, నీవు వర్గ రహిత సమాజ స్థాపనకై చివరికంటా పోరాడుతానని శపథం చేసిన నీ శపథాన్ని నేటి నీ అమరత్వంతో నిరూపించుకున్నందుకు నీ అమరత్వం నాకు ఎంతో సత్తువనిస్తుందని, నీ ఆశయ బాటలోనే తప్పకుండా నా విప్లవమార్గాన్ని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఎంతటి నిర్బంధం, పెను తుఫానులు ఎదురైనా నీ ఆశయసాధనకై చివరికంటా పోరాడుతానని నీ అమరత్వం సాక్షిగా శపథం చేస్తూ...

నీకు నేను తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నానమ్మా..
కామ్రేడ్ నవత అమర్ హై! అమర్ హై!
కామ్రేడ్ నవత ఆశయాన్ని కొనసాగిద్దాం! కొనసాగిద్దాం!

**నీ**
**ప్రభాకర్**

# అమ్మ యాదిలో....

నేను సంవత్సరం పిల్లగా ఉన్నప్పుడు నాన్న ప్రజల కోసమని పార్టీలోకి వచ్చిన తర్వాత ముగ్గురు పిల్లల తల్లిగా తాను ఎన్నో కష్టాలుపడ్డది. అమ్మ జీవితం ఎన్నో కష్టాలు, కడగండ్లతో నిండిన ఒక పెద్ద సంద్రం. అమ్మ గురించి రాయాలంటే నా కలము పట్టి అమ్మ పడ్డ కష్టాలు, బాధలు రాద్దామని ఎంత ప్రయత్నించినా నా గుండె బరువై రాయలేని పరిస్థితిలో ఉన్నాను. కన్నబిడ్డగా నా బాధ్యతను నేను నెరవేర్చలేకపోతున్నాను అన్న బాధ నాలో ఎంతో ఉంది. కానీ అమ్మ అనుభవించిన కష్టాలు, బాధలు ఎన్నో. ఆ తర్వాత మేము పడ్డ కష్టాలు, బాధలు ఎన్నో. మా కష్టాలు కడగండ్లు కలం పట్టి కాగితం మీద ఉంచుదాం అన్నా కలం ముందుకు పోవడం లేదు. కన్నీరు కడవలై కారుతున్నాయి. ఆ కష్టాలు, బాధలు భరించలేక నాకు మానసిక రోగం పట్టుకొని 10 సంవత్సరాల నుండి వదలడం లేదు. అందుకనే మా కష్టాల సముద్రంలోకి వెళ్లడానికి మనస్సు అంగీకరించడం లేదు. క్షమించండి. అందుకనే ఆ ప్రయత్నం “నేను” మాత్రం చేయడం లేదు.

మా అమ్మ మా భవిష్యత్ కోసం ఎప్పుడూ కలలు కంటూ ఉండేది. అందుకనే తన అత్తమామలు, బావలు, ఊరివాళ్లు ఎన్ని మాటలు అన్నా తన శక్తికి మించిన పనులు చేసి ఎంతో కష్టపడి మాకు చదువులు చెప్పించింది. నాది 6 సంవత్సరాల చిన్న వయస్సు కానీ నా మనసుకు మించిన పెద్ద ఆలోచనలు. అమ్మ ఏడుస్తావుంటే ఎందుకు ఏడుస్తుందో తెల్వక 'ఎందుకేడుస్తున్నవే... ఏమైందే?' అంటూ భోరున ఏడ్చేవాళ్లం. అమ్మ ఎందుకు ఏడుస్తుందో చెప్పితే కూడా అర్థం చేసుకోలేని పసికూనలం. అమ్మ సంతోషమే మా సంతోషంగా బతికినవారం. అమ్మ కూడా అంతే. అమ్మ ఎన్ని కష్టాలు, ఇబ్బందులు, సమస్యలు ఎన్ని వచ్చినా తన మనస్సులో ఉంచుకొని మానసికంగా చెప్పరాని క్షోభననుభవించింది. తన బాధలు మాకర్థమయితే మా చదువులపై ప్రభావం పడి పిల్లల భవిష్యత్ నాశనం అవుతుందని అమ్మ మాతో చెప్పేది కాదు.

వయసుతో పాటు పెరిగిన జ్ఞానం మాకు అమ్మ కష్టాలను అర్థం చేయించింది. అందుకే అమ్మకు అన్ని పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటూ, పట్టుదలగా చదివి పెద్ద డాక్టరునయ్యి అమ్మను సుఖపెట్టాలని ఆశించేదాన్ని. ఆ ఉద్దేశ్యంతోనే చదువులో ఎప్పుడూ ప్రథమ స్థానంలో ఉండేదాన్ని. ఇలా ఆకాశం ఎత్తుగా ఊహించిన నా కలలకు ఫుల్‌స్టాప్ పడింది. 2001లో అమ్మ మమ్మల్ని వదిలి పార్టీలోకి వచ్చింది. అమ్మే ఇన్ని రోజులు సర్వస్వంగా బతికిన నాకు ఒంటరిగా ఉండవలసిన అవసరం ఏర్పడ్డది. అమ్మను విడిచి క్షణం ఉండలేని నేను బయటి సమాజంలో ఉంటూ ఈ 'లోకం కాకులు' అన్న విషయం తెల్వక లోకం పొడిచే పొడుపులను జీర్ణం చేసుకోలేక నేను అనుభవించిన మానసిక క్షోభ చెప్పలేనిది. ఈ ఆవేదన తట్టుకోలేక నా భవిష్యత్‌ను నాశనం చేసే మానసిక రోగం నన్ను వదలకుంట పట్టుకుంది. ఈ మాట పార్టీలో ఉండే విన్న నా తల్లి 'నా బిడ్డ చదివింది చాలు, నా బిడ్డ అనారోగ్యంతో చచ్చేలా ఉంది. నా బిడ్డను పిలిపిద్దాం' అని పార్టీ అనుమతి తీసుకొని నాకు అనారోగ్యం వచ్చేలా ప్రవర్తించిన ఆ సమాజాన్ని చీదరించుకుని, నన్ను పార్టీలో భాగం చేస్తూ రోగంతో చచ్చే స్థితికి వచ్చిన నాకు ఈ భూదేవికి ఉన్నంత ఓపికతో నా కన్న తల్లి నిద్రాహారాలు, అన్న పానీయాలు మరచి నాకు పునర్జన్మనిచ్చింది. వర్గ పోరాటంలో ప్రజల బిడ్డగా పార్టీయే తల్లిగా, తోటి కామ్రేడ్స్ తోబుట్టువులుగా వుండాలని, మా-లె-మా సిద్ధాంత వెలుగులో అంటూ మాకు హితబోధ చేసేది మా అమ్మ. తన ప్రేమ ఆప్యాయతలు పంచే తల్లిగా మాత్రమే కాకుండా తండ్రిగా, గురువుగా, కామ్రేడ్‌గా అన్నీ తామై మమ్మల్ని క్రమశిక్షణగల కామ్రేడ్స్‌గా తీర్చిదిద్దింది. అమ్మ పీఎల్‌జీఏ కామ్రేడ్స్‌కు తన

ప్రేమ, ఆప్యాయతలు పంచుతూ ఒక అమ్మగా, అమ్మమ్మగా, అక్కగా, క్రమశిక్షణ గల కామ్రేడ్‌గా మాకు ఆదర్శంగా చిరకాలం నిల్చిపోతుంది. మా అమ్మ మాకు పునర్జన్మనిచ్చి మహోన్నతమైన కమ్యూనిస్టు పార్టీ ముందర ఉంచింది.

నూతన సమాజ నిర్మాణం కోసం ఎక్కడికైనా వెళ్లి పని చేయడంలో, మా అందరి కృషి వుంది. అందులో మా అమ్మ కూడా. ప్రజల కోసం కృషి చేసింది. ఎప్పుడు అమ్మ వ్యక్తిగత జీవితం కోరలేదు. మార్క్స్ సిద్ధాంతాలను నెమరేస్తూ తన అంతిమ శ్వాస విడిచింది.

అమ్మ కలలు నిజం చేయ, అమ్మ ఆదర్శాలను పుణికిపుచ్చుకొని పార్టీ ఇచ్చిన బాధ్యతలు సంపూర్ణంగా నెరవేర్చ మన శాయశక్తులా కృషిచేస్తూ చివరి శ్వాస వరకూ ప్రజల కోసం పోరాడుతూ నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములవుదాం. ఇదే మన అమ్మకు మనం అర్పించే నిజమైన నివాళి.

**– లావణ్య**

# అమ్మమ్మా..

ఒకనాడు తండ్రికి ఎడమై తల్లి ప్రేమలోనే తండ్రిని చూసుకుంటూ బతికాం. ఇప్పుడు తల్లికి శాశ్వతంగా దూరమై నాన్నలోనే తల్లిని చూసుకుంటున్నాం. అమ్మమ్మా... మేం కఠోరమైన యుద్ధంలో ఉన్నామే. నీవు బిడ్డకు దూరమైనట్లే మేం తల్లికి దూరమయ్యాం. ఈ దోపిడీ వ్యవస్థ కారణంగానే అమ్మకు దూరమయ్యాం. అమ్మ ఇక మాకు కనిపించదు. ఈ దు:ఖాన్ని ఇలా అక్షరాలతో పంచుకోవడం అసాధ్యం. ఇంటికాడే కాదు విప్లవంలోనూ అమ్మను చాలా గాఢంగా ప్రేమించాం. తలుచుకుంటే మేం ఒంటరయ్యామా అనిపిస్తోంది. అమ్మ స్పర్శ మాయమైంది. అమ్మ చూపుకు అందకుండా పోయింది. చిన్నప్పుడు అమ్మ కొంగుపట్టుకొని మారాం చేసిన రోజులు పదేపదే గుర్తుకు వస్తున్నాయి. మాకు బాల్యంలోని ఇలాంటి ఒకటి రెండు మధురమైన గుర్తులు తప్ప ఏం మిగిల్చిందే ఈ రాజ్యం. మనసు తడిసి ముద్దయిపోతోంది. అమ్మ లేదని అంగీకరించడం కష్టంగా ఉంది.

విప్లవకారులుగా, ఒక విప్లవకారిణి బిడ్డలుగా అమ్మ అమరత్వం అత్యున్నతమైనదని మేం గుర్తించాం. దండకారణ్య ప్రజలూ గుర్తించారు. అందుకే ఆమ్మ అంతిమయాత్రను దగ్గరుండి జరిపించారు...వాళ్లతో దు:ఖాన్ని పంచుకున్న మేం వాళ్లలోనే అమ్మను పొందగలిగాం..

**– రమేష్**

**కవితలు**

# ఆదర్శమూర్తి మా 'అమ్మ'

- శాంతి

పొడిచే ఎఱ్ఱ సూర్యుడిలో ఎఱ్ఱ మందారం నీవు
తెలంగాణ పోరుగడ్డపై పుట్టిన వీరనారివి నీవు
పోరుబిడ్డల కన్న వీరమాతవు నీవు
తప్పటడుగులు వేస్తున్న బిడ్డలకు నడక నేర్పిన తల్లివి నీవు
ఈ దోపిడి సమాజంలో బతకాలంటే విద్యాబుద్ధులు కావాలని
చదువులు నేర్పిన తల్లివి నీవు
ప్రజలే మన గురువులని హితబోధ చేసిన అమ్మవు నీవు
మా-లె-మా సిద్ధాంత వెలుగులో
కష్టాలు, కన్నీళ్లకు వెరవని కమ్యూనిస్టువు నీవు
మరణం సహజం అయినది, కానీ
ఒక మహోన్నత లక్ష్యం కోసం ప్రాణమివ్వడం
హిమాలయ పర్వతాల కన్నా పెద్దది అని
అమ్మ ఆచరణలో చూపింది
మాకు ఆదర్శంగా నిలిచింది
మా అమ్మ
ఓ అమ్మా ఎక్కెడెల్లిపోయినవ్
మా అమ్మా మమ్ము వదిలి పోయినావా
నీ జాడ లేదాయే.... నీ చూపు కానరాదాయే
కష్టాలు-కన్నీళ్లు ఎప్పుడు ఉండేవానే
ఓ అమ్మ బతుకే ఓ కన్నీళ్లని
మా అమ్మ బతుకు పోరు జేసినావ్
రక్తబంధాల కన్న వర్గ బంధం గొప్పదని
అందరిని వదులుకొని ప్రజలే మన గురువులని
కలకాలం కమ్యూనిస్టుగా బతకాలని చెప్పి నీవు
ఓ అమ్మ బందూక్ చేబట్టి

మా అమ్మ జంగ్ బాట పట్టి
ఈ దోపిడి రాజ్యం కూల్చ కంకణం కట్టాలని
ఆయుధంతో పాటే అక్షరం కావాలని
పలక, బలపం పట్టి అక్షరాలు నేర్చినావ్
ఓ అమ్మ రాజనీతులు ఎన్నో చెప్పి
మా అమ్మ ఆదర్శమూర్తివి అయినావ్
మా–లె–మా సిద్ధాంత వెలుగులో సాగిపోవాలని అంటూ
పార్టీయే తల్లిగా - ప్రజలే మన గురువులుగా
అనారోగ్యం లెక్కచేయక విప్లవంలో ముందుండినావు
ఓ అమ్మ నీ కలలు నిజం చేయ
మా అమ్మ పోరు మేము జేస్తమమ్మ
మా అమ్మ నీ ఆశయాన్ని నెరవేరుస్తామమ్మా

# అమ్మ!

**- నిర్మల**

అమ్మా!
నవమాసాలు మోసి జన్మనిచ్చిన అమ్మ
బుడి బుడి నడకలు చిలిపి నవ్వులను
చూస్తూ వేలుపట్టి నడిపిన అమ్మ
సమాజంలో ఒక బాధ్యతగల పౌరులుగా బతకడానికి
సమాజ నియమాలను ఉగ్గుపాలతో రంగరించి తాపిన అమ్మ
బతుకు దెరువులో కలిమి లేములను కష్టసుఖాలను
కాచి వడబోసి కాకలుదీరిన యోధురాలిలా
మా కండ్ల ముందు నిలిచిన అమ్మ
చుట్టపక్కల ఈసడింపులను లెక్కచేయక
పసికందులను సంకనేసుకుని బీడీల సాటను
చేత పట్టుకొని ఊరూరా తిరుగుతూ
వర్గ బంధాన్ని పెన వేసుకున్న అమ్మ
నిర్బంధపు నీడలను గేలిచేస్తూ
శత్రువు కుటుంబ కౌన్సిళ్లను

వాడి సరెండర్ మాయమాటలను
కాలిగోటితో తన్ని
తన భాగస్వామికి భరోసానిచ్చిన అమ్మ
మాతృత్వపు మాధుర్యాన్ని మమతలు
మమకారాలను పేదవాడలల్లో చూడమన్న అమ్మ
పంచాది నిర్మలలా చంటి బిడ్డలతో
అంకమ్మ-నిర్మల బాటలో కదిలిన అమ్మ
తమ పిల్లలు జబ్బలకు తుపాకివేసి నడుస్తుంటే
గోర్కి అమ్మలా మురిసిపోయిన అమ్మ
అనారోగ్యంతో అంతిమ శ్వాస విడిచి
కిష్టారం ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న అమ్మ
నవ సమాజ నిర్మాణ బాధ్యతను
మా భుజస్కంధాలపై వేసి వెళ్లిన అమ్మ
కమ్యూనిజంలో కలుస్తానని అప్పాయింట్ ఇచ్చిపోయిన అమ్మ
అమ్మ పిలుపుకోసం ఎదురుచూస్తూ
ఆ సమాజ నిర్మాణంకై కంకణబద్దులపై
కదులుతాం ముందుకు మునుముందుకే
*(కిష్టారం ఏరియాలో జూన్-3 నాడు అనారోగ్యంతో అమరురాలైన కా. నవతక్క జ్ఞాపకాల తడిలో...)*

## కామ్రేడ్ నవతక్క

**- వి. శ్రుతి సాగర్**

చూస్తే భూమికి జానెడే
కానీ ఆమె మూడు పర్వతాలను సవాల్ చేసింది
గట్టిగా గాలి వీస్తే ఎగిరిపోతుందనిపించే అర్భకురాలే
కానీ ఆమె సుడిగాలులనూ, పెను తుఫానులను ఢీకొన్నది
ఆమె గజ ఈతరాలేమీ కాదు
కానీ ఏటికి ఎదురీదిన సాహసి
ఆమె మార్క్సిజం-లెనినిజం-మావోయిజంను ఔపోసన పట్టలేదు

కానీ దోపిడీ కోటలను నేలమట్టం చేసే మార్గాన్ని చక్కగా అవగతం చేసుకొన్న జ్ఞాని

* * *

తలవొంచుకొని అతనితో ఏడడుగులు నడిచిన రోజు
ఆమె కలల ఛత్రం సంకుచితమైనదే
అనురాగం పంచే భర్తా
మమకారం పంచే పిల్లలే
కానీ అతనితో వేసిన ఏడడుగులు
నక్సల్బరీ తొవ్వలోకి దారితీసినయి
ఉత్తర తెలంగాణా గెరిల్లా జోన్‌లో నడిపించినయి
సరిహద్దులను దాటుకొని దండకారణ్య విముక్తి బాటలోకి తీసుకెళ్లినయి
ఇప్పుడతను ఆమెకు భర్త కాదు
సహచరుడు
ఇప్పుడామె అతనికి భార్య కాదు
సహచరి

* * *

వాళ్లిద్దరి అనురాగ గురుతులను
వాళ్లిద్దరి ప్రేమ పంటను
అతను దున్నిన చాలులో
ఆమె పోరు విత్తనాలుగా నాటింది
అవి మొలకెత్తి, మారాకులు వేసి, కొమ్మలు, రెమ్మలు వేస్తే
మురిసిపోయిందే కానీ
ఫలాలను ఆశించలేదు
పంటంతా ప్రజలకే అంకితమంది
ఆమె తల్లి హక్కును కోల్పోలేదు
స్వచ్ఛందంగా రద్దు చేసుకొంది
అట్లా రద్దు చేసుకొని
ఎందరికో తల్లయింది
ఆదర్శ కమ్యూనిస్టయింది.

# అద్భుత మానవి

**– పాణి**

నా దండకారణ్య ప్రయాణం ఆరంభంలోనే కా. నవత కలిసింది. చాలా అనారోగ్యంగా ఉండేది. కలవగానే తను తెలంగాణ మహిళ అనిపించింది. తెలుగు ధారాళంగా మాట్లాడలేకపోయింది. అంతగా గోండీలో కలగలసిపోయింది. ఆదివాసీ జీవితాన్ని సొంతం చేసుకుంది. ఆ రకంగా నా దండకారణ్య పర్యటనలో ఆమె తొలి అనువాదకురాలు కావడం వల్ల నాకు ఎంతో మేలు జరిగింది. కలిసిన మరుసటి నిమిషం నుంచే ఆమె నాకు దండకారణ్యం గురించి చెప్పడం మొదలు పెట్టింది.

నవతలాంటి వాళ్లకు ఆచరణ వల్ల ఎంత నిర్దిష్ట అధ్యయనం ఉంటుందో బైటివాళ్లు తెలుసుకోవాలి. దండకారణ్యం గురించిన ఆమె సంభాషణ .. మేం కలిసిన ఆ ఊరి దగ్గర మొదలైంది. విప్లవకారులు ఆ ఊరికి పరిచయం అయిన దగ్గరి నుంచి ఇవాల్టి క్రాంతికారీ జనతన సర్కార్ పనుల దాకా ఒక రేఖా చిత్రాన్ని నా ముందు పరిచింది. ఆ ఊళ్లో ఎంత మంది కామ్రేడ్స్ అమరులయ్యారో చెప్పి, ఊరికి ఓ చివర ఉండే రెండు స్థూపాలను చూపించింది. ఊరంతా తిప్పి ప్రజలకు మన దాదానే అని పరిచయం చేసింది. ఇండ్ల ముందు నాటుకున్న కూరగాయల పాదుల దగ్గరి నుంచి మిట్ట మీదున్న నువ్వుల చేల దాకా చూపించింది.

నవత చూపించిన ఆ ఊరి స్థూల చిత్రంలో ఎవరికైనా దండకారణ్య సూక్ష్మ దృశ్యం అగుపిస్తుంది. అది ఆమె మామూలు మాటల్లో ఉన్న పద్ధతి. అలా దండకారణ్యంతో నాకు పరిచయం మొదలైంది. ముఖ్యంగా ఆదివాసుల స్వభావం, వాళ్ల స్పందనా గుణం, ఆలోచనారీతుల గురించి ఎంత చెప్పిందో లెక్క లేదు. ఇవన్నీ లేకుంటే నా దండకారణ్యం అధ్యయనం మరీ అరగొరగా మిగిలిపోయేదేమో.

ఆదివాసుల గురించి ఏదైనా అడిగితే ఆమె ఏదో ఒక ఘటన చెప్పేది. అందులో నేనడిగిన ఒక ప్రశ్నకేగాక ఇంకా అనేక ప్రశ్నలకు సమాధానాలు ఉండేవి. మరెన్నే ప్రశ్నలు రేకెత్తేవి. అంత గాఢమైన జీవిత, ఉద్యమానుభవాలను ఆమె నుంచి నేర్చుకున్నాను. అక్కడి నుంచి వచ్చేశాక ఇప్పటికీ వెంటాడుతున్న అనేక మంది వ్యక్తుల్లో నవత కూడా ఒకరు. ఇప్పుడు తన వివరాలు తెలుస్తున్నకొద్దీ నవత మరింతగా దగ్గరవుతున్నది. 'జనతన రాజ్యం' విడుదల కాకముందే తను అమరురాలు కావడం ఎన్నటికీ తీరని వెలితి. ఆందులో ఆమెను మమత అని వ్యవహరించాను. ఒక మామూలు మనిషి అంతే మామూలుగా ఉంటూ అసాధారణమైన ఎత్తులకు ఎదగడం వర్గపోరాటం వల్లే సాధ్యమని నవతలాంటి వాళ్లు నిరూపిస్తారు. ఒక సామాజిక ప్రయోగంలో భాగమయ్యే క్రమంలో జీవితాన్ని కూడా ప్రయోగంగా మలచడం అనే విద్య అలాంటి వాళ్లకే తెలుసు. బహుశా సులోచన విప్లవకారిణిగా ఎదిగే క్రమంలో ఎంత రప్చర్ అనుభవించిందో ఇప్పుడు ఆమె వ్యక్తిగత, రాజకీయ సహచరులే చెప్పగలరేమో. అయితే ఈ పరిణామంలో ఆమె అత్యంత సహజంగా భాగమైందని మాత్రం నాకు అర్థమైంది. ఆలాంటి వ్యక్తిత్వాన్ని గుర్తు పెట్టుకోవడం, అర్థం చేసుకోవడమే నివాళి. ★